

కోడ్.. +92

నేను ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్ మాట్లాడుతున్నా... మీ అబ్బాయి మరో ముగ్గురితో కలసి డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడ్డాడు. విచారణ కోసం వచ్చాం... మీరు మాతో రావలసి ఉంటుంది.. ఇది ఒకరికొచ్చిన కాల్

సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ మాట్లాడుతున్నా... మీ అమ్మాయి ఇప్పుడు మీ దగ్గర ఉందా? ఉంటే నాతో మాట్లాడించండి. మీ దగ్గర ఉండదు. ఎందుకంటే మేము ఓ నేరంలో అరెస్ట్ చేశాం. ఆ కేసుకు సంబంధించి రూ.65వేలు చెల్లిస్తే కేసులో తీవ్రమైన సెక్షన్‌లు లేకుండా చేస్తాం.. రూ.లక్ష ఇస్తే అసలు కేసే లేకుండా చూస్తాం.. లేదంటే మరికొన్ని నేరాలు మోపి జైల్లో వేస్తాం... ఇది మరొక తండ్రికి వచ్చిన కాల్... ఇట్లా ఎందరికో కాల్స్.. అన్నీ +92 సిరీస్ ఫోన్ నంబర్‌తో కాల్ రావటం, వాట్సప్ డీపీ కింద సీబీఐ లోగో కానీ, ఇన్‌స్పెక్టర్ డ్రెస్‌లో ఉన్న వ్యక్తి ఫోటోతోకానీ వస్తుండటం జనాన్ని భయభ్రాంతులకు గురిచేస్తోంది.

- +92 కోడ్‌తో కాల్ వచ్చిందంటే టెర్రర్
- సీబీఐ, సైబర్ పోలీసుల పేరుతో పాకిస్తానీ నంబర్ నుంచి కాల్స్
- పోలీస్ స్టేషన్ సెట్టింగ్‌తో వీడియో కాల్స్ కూడా
- మీ పిల్లలు ఫలానా నేరాలు చేశారంటూ... బెదిరింపులు
- కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు వారి చేతుల్లో!
- భయం వద్దు... సంచార్ సాథీ పోర్టల్‌లో ఫిర్యాదు చెయ్యాలంటున్న టెలికం

పాకిస్తానీ వాట్సప్ కాల్...

తెనాలి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ళ వలలో కొంత మంది మోసపోతుంటే, మరికొందరు వారి వలలో పడకుండా జాగ్రత్తప డుతున్నారు. తాజాగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఈ పరిస్థితి మరీ ఎక్కువయిపోయింది. పగలు, అర్ధరాత్రి తేడా లేకుండా వాట్సప్ నుం చి కాల్స్ చేయటం, కొందరికైతే ఏకంగా వీడియో కాల్ చేసిమరీ భయభ్రాంతులకు గురిచేస్తుండటం కొసమెరుపు. వారి వెనుక సీబీఐ కార్యాల యం అన్న సంకేతాలు ఉండేలా ఫోటోలు, లేక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రూమ్ సెట్టింగ్‌తో ఉండటం ఎంతటి తెలివైనవారికి కానీ, అప్రమత్తంగా ఉండేవారిని సైతం అయోమయానికి గురిచేస్తోంది. దీంతో వాట్సప్‌కు ఆ ఫోన్ కాల్ వచ్చిందంటే చాలు... వాట్సప్ యూజర్లు హడలెత్తిపోతున్నారు.

సీబీఐ, సైబర్ క్రైమ్ లోగోలు పెట్టి మరీ...

+92... ఏదైనా ఫోన్ నంబర్ ముందు ఈ సిరీస్ ఉందంటే అది పాకిస్తాన్ దేశపు టెలికం కోడ్. అయితే నంబర్ పాకిస్తాన్‌కు చెందిన సెల్ కంపెనీలదయితే, వాట్సప్ డీపీలు, వీడియోల్లో సెట్టింగ్స్ మాత్రం భారత్‌కు సంబంధించినవే కావటం విశేషం. పాకిస్తానీ సైబర్ నేరగాళ్లు, ఆర్థిక నేరస్తులు ఈ తరహాలో జనాన్ని భయపెట్టి, బెదిరించి సొమ్ము చేసుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఈ పనిలో భాగంగానే గత కొద్ది రోజుల నుంచి మామూలు కాల్స్ కాకుండా కేవలం వాట్సప్ నుంచి మాత్రమే కాల్స్ చేస్తుండటం, భయపెట్టటం వంటి వాటికి పాల్పడుతున్నారు. ఎక్కువ శాతం కాల్స్ వచ్చిన వారికి 'ఇన్‌స్పెక్టర్ రాజీవ్ కుమార్ బోల్ రహా హూన్' అంటూ మొదలు పెట్టి, తర్వాత మీ అబ్బాయి ఓ రేప్ కేసులో ఇరుక్కున్నాడని ఒకరికి, మీ అమ్మాయి తన ఫ్రెండ్స్‌తో కలసి డ్రగ్స్ కేసులో ఉందని, అరెస్ట్ చేశామని మరొకరికి, ఇట్లా ఏదో ఒక నేరం చూపించి అరెస్ట్ చేశామని, విడుదల కావాలంటే మేము చెప్పిన డబ్బు పంపాలని బెదిరించటం వీరి నైజం. ఐతే ఎవరికైనా అనుమానం వచ్చి ఎదురు ప్రశ్నలు వేస్తే వారికి వీడియో కాల్ చేసి, పోలీస్ సెట్‌తో స్టేషన్ వాతావరణం కనిపించేలా చూపిస్తూ, ముఖాలు కనిపించకుండా కొందరిని చూపించి వారిలో మీ అబ్బాయికూడా ఉన్నాడని చెప్పటం, డబ్బు డిమాండ్ చేయటం మరో కోణం. అప్పటికీ నమ్మకుంటే వెంటనే కాల్ కట్ చేసి, తర్వాత రోజు సీబీఐ కాకుండా, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ డ్రెస్‌లో ఫోన్ నంబర్ స్థానంలో సైబర్ క్రైమ్ పోలీస్ అని వచ్చేలా వాట్సప్ డీపీ, పేరు సెట్‌చేసి మరీ మరోసారి కాల్ చేస్తున్నారు. ఇక్కడా ఒకే తంతు. కాకుంటే నేరాలు మారిపోతాయి. తెనాలికి చెందిన నవీన్‌చంద్ర అనే యువకుని తండ్రికి సోమవారం, మంగళవారం వరుసగా రెండు రోజులు కాల్స్ వచ్చాయి. మీ కుమారుడు డ్రగ్స్ నేరంలో ఉన్నాడని, మా అదుపులో ఉన్నాడని, వెంటనే రూ. 35వేలు పంపాలని, లేకుంటే మీకు కనిపించకుండా చేస్తామని బెదిరించినట్టు చెబుతున్నారు. నసీమా అనే మహిళకు ఫోన్ చేసి, మీ అమ్మాయి మా దగ్గర ఉందని, ఒక దారుణ నేరాన్నిచెప్పి, ఆ కేసులో అరెస్ట్ చేశామని, కేసు నుంచి మీ అమ్మాయికి ఉపశమనం రావాలంటే రూ. 75వేలు వెంటనే పంపాలని, పూర్తిగా మినహాయింపు కావాలంటే రూ. 1 లక్ష పంపాలని, చెప్పారని, దానికి ఆమె అంగీకరించటంతో పేమెంట్ లింక్ పెడతామని చెప్పి, ఒక లింక్ పెడితే అది పాకిస్తాన్ అడ్రస్ చూపటంతో ఆమె డబ్బు వేయకుండా ఆపేశామని చెప్పారు. అయితే ఆ లింక్ అర్ధగంటలో కనిపించకుండా పోయిందని వివరించారు. ఇదే తరహాలో చాలా మందికి ఫోన్ రావటం, బెదిరిస్తూ మాట్లాడి, వారిని భయపెట్టి డబ్బు రాబట్టే ప్రయత్నాలు చేయటం జరుగుతూనే ఉంది.

> ఒకవేల ఇటువంటి కాల్స్ వచ్చినా.. ఎవరైనా మోసపోయినా వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్‌చేసి, తర్వాత సంచార్‌సాథీ పోర్టల్‌లో కానీ, సంచార్ సాథీ.జీఓవీ.ఇన్‌కు, లేక సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా కానీ, లేక సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కానీ సమాచారం అందించాలని టెలికం శాఖ ఒక ప్రకటన కూడా జారీ చేసింది. అయితే ఇవన్నీ చాలామందికి తెలియక మిన్నకుంటున్నారు. కొందరయితే లోకల్ పోలీస్ స్టేషన్‌లలో రిపోర్టు ఇచ్చి వదిలేస్తున్నారు. దీంతో పాకిస్తానీ తరహా సైబర్ నేరాలు మరింత పెరిగిపోతున్నాయి.

పాకిస్తాన్‌కు చెందిన +92 సిరీస్ నుంచి...

ఫోన్ నంబర్ కంట్రీ కోడ్ పాకిస్తాన్‌దయితే, డీపీలు, ఇతర చిత్రాలన్నీ ఇండియా పేరుతో ఉండేలా నేరాలకు పాల్పడటం కలవరపెడుతున్న విషయం. వాట్సప్ కాల్ వచ్చినప్పుడు దానిపై సీబీఐ అని, సైబర్ పోలీస్ అని ఉంటోంది. అయితే ట్రూ కాలర్ కానీ, ఫోన్ నంబర్ ఐడెంటిఫికేషన్ ఉన్న ఇతర యాప్‌లు ఫోన్‌లో ఉంటే వాటిలో మాత్రం పాకిస్తాన్ అని కానీ, 'సిఎం.పాక్'(చైనా మొబైల్ పాకిస్తాన్) అని నంబర్ కింద కనిపిస్తోంది. అంటే పాకిస్తాన్ మొబైల్ డేటా ఆపరేటర్ నుంచే ఇవన్నీ వస్తున్నట్టు మాత్రం కనిపిస్తోంది. అయితే వారు నేరుగా ఇక్కడి బ్యాంక్ ఖాతా నంబర్‌లు ఇవ్వకుండా, పాకిస్తాన్‌కు చెందినవే ఇస్తున్నా సైబర్ నేరాల కింద అదుపులోకి రాకపోవటం విశేషం. వారి నుంచి సంభాషణ మాత్రం పూర్తిగా హిందీ లేక ఉర్దూలో ఉంటోంది. అయితే ఇటువంటి ఫోన్ కాల్స్ వస్తే వాటిని ఆన్సర్ చెయ్యవద్దని, ఒకవేళ వారు ఏదైనా లింకులు పెట్టి చూడమన్నా ఓపెన్ చెయ్యవద్దని, మీ వ్యక్తిగత సమాచారం అస్సలు పంచుకోవద్దనేది భారత టెలికం శాఖ చేస్తున్న హెచ్చరిక.




సీబీఐ లోగోతో వాట్సప్ డీపీ పెట్టిమరీ ఫోన్ కాల్ చేస్తున్న చిత్రం

+92 315 0737371
Pakistan · CMPak Limited

నంబర్ కింద పాకిస్తాన్ పేరు, కంపెనీ పేరు కనిపించేలా ఉన్న చిత్రం







నవ డ్రోన్ శకానికి నాంది



- ఆకాశంలో అద్భుతాలను ఆవిష్కరించిన డ్రోన్ షో

నవ డ్రోన్ శకానికి నాంది పడింది. దేశాన్ని డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో అమరావతి డ్రోన్ సమ్మిట్ క్రియాశీలక అడుగు వేయగా.. డ్రోన్‌షో దీనిని పతాక స్థాయికి తీసుకెళ్ళింది. అమరావతి డ్రోన్ షో ఆకాశంలో అద్భుతాన్నే చేసింది. 5,500 డ్రోన్లు నింగికేగి చేసిన విన్యాసాలు ఒళ్ళు గగుర్పొడిచాయి. ఆకాశంలో సప్తవర్ణ చిత్రాలను డ్రోన్లు ఆవిష్కృతం చేసి కృష్ణా తీరాన పున్నమి ఘాట్‌లో ఉన్న అశేష జనవాహినిని ఓలలాడించింది. డ్రోన్లు చేసిన మాయాజాలం అంతా , ఇంతా కాదు. వర్ణ చిత్రాలను ప్రదర్శించటమే ఒక అద్భుతమైతే, వాటిని త్రీడీ మూవింగ్ టెక్నాలజీలో చూపించటం మహాద్భుతం. ఆకాశంలోకి నక్షత్రాల్లా మెరుస్తూ డ్రోన్లు సందడి చేయగా వీక్షకులు మైమరిచి వీక్షించారు. డ్రోన్ షో అంతా కూడా ఏవియేషన్ థీమ్ మీదనే ప్రధానంగా సాగింది. తొలి ఏవియేషన్ తపాలా బిళ్ల, ఆధునిక సౌకర్యవంతమైన విమాన ప్రయాణాలకు నిదర్శనంగా అతి పెద్ద బోయింగ్ విమానం, అమరావతి గొప్పతనాన్ని వివరించేలా బుద్ధుడి ఛాయాచిత్రం, అతిపెద్ద జాతీయ జెండా, గ్లోబల్ ఏవియేషన్ ప్లానెట్ ఛాయా చిత్రాలను ఆయా థీమ్‌లో డ్రోన్లు కళ్ళకు కట్టినట్టు ప్రదర్శించాయి. కృష్ణాతీరంలో అశేష జనవాహిని సమక్షంలో నిర్వహించిన డ్రోన్ షో ఐదు గిన్నిస్‌బుక్ రికార్డులను నెలకొల్పింది. డ్రోన్‌షో ముగియగానే లేజర్ బీమ్ షోను నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

ఆకట్టుకున్న డ్రోన్ సమ్మిట్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, పక్కన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు

- అట్టహాసంగా మంగళగిరిలో ప్రారంభోత్సవం
- సీకే కన్వెన్షన్‌లో జాతీయ సంస్థల స్టాల్స్ ప్రదర్శన

8



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకయ్యనాయుడు, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


పిల్లలకు కుటుంబ విలువలు నేర్పించాలి

- భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి
- కాకతీయ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

8

అమరావతి రైలుమార్గానికి భూసేకరణ

- 7 గ్రామాల్లో 200 ఎకరాలు
- సర్వే నంబర్లతో ప్రాథమిక నోటిఫికేషన్
- గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాల స్వీకరణ
- రైతులను ఒప్పించనున్న అధికారులు



అమరావతి రైలుమార్గం ఎలైన్‌మెంట్ (ఎరుపు రంగులో ఉన్నది)


గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి నూతన రైలుమార్గం వేయడానికి భూమి సేకరించేందుకు తొలి అడుగు పడింది. ఈ బ్రాడ్‌గేజ్ రైలుమార్గం (ఎర్రుపాలెం -నంబూరు) కోసం గుంటూరు జిల్లాలో దాదాపుగా 200 ఎకరాల వరకు భూమి సేకరించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఆ మేరకు ఎలైన్‌మెంట్‌ను రెవెన్యూ శాఖకు ఇవ్వగా.. సర్వే నంబర్లవారీగా సేకరించదలచిన భూమి విస్తీర్ణాన్ని పేర్కొంటూ ఆ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి భూసేకరణకు ముందుకెళ్తామని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. సాధ్యమైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేసి రైల్వే శాఖ కోరిన స్థలాన్ని స్వాధీనపరుస్తామని పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల గురించి చర్చించారు. వాటిలో ప్రధానమైన అమరావతి రైలు మార్గాన్ని ముందుగా చేపట్టాలని ఆ శాఖ నిర్ణయించింది. మొత్తం 56.53 కిలోమీటర్ల పొడవున తొలుత సింగిల్ లేన్ నిర్మించనుంది. ఇందుకోసం గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరు, పెదకాకాని.. తాడికొండ మండలంలోని కంతేరు, మోతడక, తాడికొండ.. తుళ్లూరు మండలంలోని వడ్డమాను, పెదపరిమి గ్రామాల్లో భూసేకరణకు చర్యలు చేపట్టింది. ఈ ఏడు గ్రామాలూ రాజధాని వెలుపల ఉన్నవే. మరికొన్ని గ్రామాలు కూడా ఎలైన్‌మెంట్‌లో ఉండగా అవి రాజధానిలో భాగం కావడం, ఆ భూమి సీఆర్‌డీఏ స్వాధీనంలో ఉన్న దృష్ట్యా ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఆ భూమి తీసుకునే వెసులుబాటు ఉంది.

ఏ గ్రామంలో ఎంత భూమి..?

పెదకాకాని మండలం కొప్పురావూరులో 33 సర్వే నంబర్లలో 27.43 ఎకరాలు, పెదకాకానిలోని 6 సర్వే నంబర్లలో 5.73 ఎకరాల భూమిని సేకరిస్తారు. తాడికొండలో ఎక్కువ విస్తీర్ణంలో భూమి సేకరించాల్సి ఉంది. 95 సర్వే నంబర్లలో 69.096 ఎకరాల భూమి సేకరించాలి. అలానే మోతడకలో 15 సర్వే నంబర్లలో 31.05 ఎకరాలు, కంతేరులో 30 సర్వే నంబర్లలో 31.254, తుళ్లూరు మండలం పెదపరిమిలో 48 సర్వే నంబర్లలో 23.66 ఎకరాలు, వడ్డమానులోని 17 సర్వే నంబర్లలో 11.492 ఎకరాల భూమిని సేకరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడు గ్రామాల్లో మొత్తంగా 199.712 ఎకరాల భూమి రైలుమార్గానికి అవసరం. ఇందుకోసం రైతుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించడంతో పాటు గ్రామసభలు నిర్వహించి ప్రాజెక్టు ఆవశ్యకతను తెలియజేసి వారిని ఒప్పిస్తారు. సర్వే నంబర్లు, వాటిలో ఎంత విస్తీర్ణం సేకరిస్తారో తెలియజేసే నోటిఫికేషన్‌ను తహశీల్దార్, ఆర్‌డీవో, జాయింట్ కలెక్టర్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు.

నిండుకున్న ట్రిపుల్ వ్యాక్సిన్

- ఆరోగ్యశాఖకు నిలిచిపోయిన డీపీటీ టీకా
- త్వరలో వస్తాయంటున్న వైద్యాధికారులు
- చిన్నారులకు పొంచి ఉన్న అంటువ్యాధుల ముప్పు



6

ఎన్నాళ్లీ విద్యావేదన!



- నాలుగు విడతలుగా నిలిచిన ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా రూ.160 కోట్ల మేర బకాయిలు
- అప్పులు చేసి ఫీజులు చెల్లించిన తల్లిదండ్రులు
- ఎంతకీ బకాయిలు రాకపోవడంతో వారిలో కలవరం

రౌడీషీటర్లను ఉపేక్షించొద్దు

- శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- రేంజ్‌లోని ఎస్పీలకు ఐజీ త్రిపాఠి దిశానిర్దేశం

8

రూ.213 కోట్ల పంట.. మూషికార్పణం

- ఎలుకలతో ఏటా 92 వేల టన్నుల వరి నష్టం
- ప్రకృతి విపత్తులను మించి అన్నదాతలపై దెబ్బ
- సామూహిక నిర్మూలనకు నడుంబిగించిన వ్యవసాయ శాఖ

గుంటూరు సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు సంభవిస్తేనే రైతులు నష్టపోతారని అనుకుంటాం. కానీ రైతును కనపడకుండా దెబ్బకొట్టేవి ఎలుకలు. ఎలుకే కదా అని తీసిపారేయకండి. ఆ ఎలుకలే ఏటా రూ.213కోట్ల విలువచేసే ధాన్యాన్ని గుట్టు చప్పుడు కాకుండా లాగించేస్తున్నాయి. ఇది ఎంత పెద్దనష్టం అంటే మూడు ప్రకృతి విపత్తులతో సమానం. అన్నదాతల కష్టాలకు కనపడకుండా కారణం అవుతున్న మూషికాలను మట్టుపెట్టేందుకు క్షేత్రస్థాయిలో ఒంటరిగా ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ప్రయోజనం ఉండటం లేదు. దీంతో సామూహిక నిర్మూలనకు వ్యవసాయశాఖ నడుంబిగించింది. జిల్లాలో ప్రతీ ఏటా అటుఇటుగా 65022 హెక్టార్లలో వరి సాగవుతుండగా సుమారు 3,70,500 టన్నుల ధాన్యం పండుతుంది. అందులో 20 నుంచి 25 శాతం పంటను ఎలుకలు పిలకల దశలోనే ఆరగించేస్తున్నాయి. అంటే సుమారు 92,625 టన్నుల పంట ఎలుకల దాడికి పాడౌతుంది. ఏ లెక్కన చూసినా రైతులకు తెలియకుండా సుమారు రూ.213కోట్లకు పైగా పంట ఎలుకల పాలవుతుంది. గుంటూరు, పెదకాకాని, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, ఫిరంగిపురం, మంగళగిరి, తాడేపల్లి, తాడికొండ, తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల, పొన్నూరు, చేబ్రోలు, కాకుమాను మండలాల్లోని వరి పంటకు మూషికాల బెడద ఎక్కువగా ఉన్నట్లు వ్యవసాయశాఖ గుర్తించింది. పంటను పాడుచేస్తున్న ఎలుకల నిర్మూలనకు రైతులు ఎంతో సొమ్ము వ్యయం చేస్తున్నారు. ఎలుకలు పట్టేవారికి రూ.5 వరకు వెచ్చిస్తుంటారు. కానీ అప్పటికప్పుడు బాగానే ఉన్నా పక్క చేలల్లో ఉన్న ఎలుకలు కొద్దిరోజులకే తిరిగి దాడి మొదలు పెడతాయి.

బ్రోమోడైలిన్ ఎరే పరిష్కారం

వరి రైతులను ముప్పుతిప్పలు పెడుతున్న ఎలుకల నివారణకు బ్రోమోడైలిన్ విషపు ఎరే పరిష్కారమని వ్యవసాయశాఖ చెబుతోంది. దానిని రైతులకు పూర్తి సబ్సిడీ మీద అందించేందుకు ఏర్పాట్లు చేసింది. శుక్రవారం నుంచి కృష్ణా డెల్టాలోని 14 మండలాల్లో బ్రోమోడైలిన్ విషపు ఎరను అక్కడికక్కడే తయారుచేసి పూర్తి సబ్సిడీపై రైతులకు అందిస్తున్నారు. గ్రామంలోని సచివాలయం వద్ద రైతుల సమక్షంలో విషపు ఎరను తయారుచేసి పంపిణీ చేశారు. బ్రోమోడైలిన్ వినియోగానికి అవసరమైన నూనె, నూకలు మాత్రం రైతులు సమకూర్చుకోవాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

> **సామూహిక నిర్మూలనే ఉత్తమ పరిష్కారం**
>
> వరి పంటను నాశనం చేస్తున్న ఎలుకల నివారణకు రైతులు వ్యక్తిగతంగా ప్రయత్నిస్తున్నా, అనుకున్నంత ఫలితం రావడం లేదు. సామూహికంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తే ఉత్తమ ఫలితం ఉంటుంది. అందువల్లే ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి సామూహిక నిర్మూలన కార్యక్రమం చేపట్టాం. వ్యవసాయ అధికారులు, సిబ్బంది స్థానిక రైతులను కలుపుకుని బ్రోమోడైలిన్ విషపు ఎర తయారుచేసి వరి పొలాల్లో పెట్టటం జరిగింది.
>
> - నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి





పెదకాకానిలో బ్రోమోడైలిన్ విషపు ఎర తయారుచేస్తున్న రైతులు, వ్యవసాయ అధికారులు

బోర్డు తిప్పేసిన బోగస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ

- శిక్షణ ఇచ్చి ఆపై ఉద్యోగ కల్పన అంటూ ప్రచారం
- ఒక్కొక్కరి వద్ద లక్షన్నర నుంచి ఆరు లక్షల వరకు వసూళ్లు

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఓ బోగస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డ్ తిప్పేసింది... ఐటీ రంగంలో నెలకొన్న ఒడుదొడుకులను, నిరుద్యోగుల బలహీనతలను ఈ సంస్థ క్యాష్ చేస్తుంది... నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి శిక్షణ కాలములో జీతం ఇస్తామని ఆ తరువాత కొంతకాలం తమ వద్దే ఉద్యోగం చేసుకోవచ్చని అప్పుడు ప్రాజెక్ట్ ఆధారంగా జీతం ఇస్తామని... అనుభవం సర్టిఫికెట్ ఇస్తామని దాని ద్వారా ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు వస్తాయని చెప్పాడన్నారు.. ఈ విధమైన ప్రకటనలతో సంస్థ నిరుద్యోగ యువతను ఆకర్షించింది... గడిచిన రెండేళ్లుగా ఇదే తరహాలో ఒక గుంటూరు జిల్లాలోనే గాక ఏపీ, మహారాష్ట్ర , తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన అనేకమంది నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తున్నామంటూ ప్రచారం చేసుకొని కోట్లు కొల్లగొట్టింది. తమ కడుపు నిండేదాకా వసూళ్ల పర్వం కొనసాగించి నిరుద్యోగుల నుంచి ఒత్తిడి పెరిగిన క్రమంలో బోర్డు తిప్పేయాలని ముందుగానే పక్కా పథకం ప్రకారం ఈ సంస్థను నడిపించారు. అయితే తాను అధికార పార్టీ నాయకుడినని, నిరుద్యోగ బాధితులు చేసేదేమీ లేక పోలీసులను ఆశ్రయించారు... దీనకి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.



అరండల్‌పేట స్టేషన్‌కు చేరుకున్న బాధితులు

ఉమ్మడి ప్రకాశం జిల్లా కారంచేడు కు చెందిన దగ్గుబాటి శ్రావణ్ చౌదరి, ముక్కు స్వర్ణ దంపతులు గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డులో డెవలప్ ట్రీస్ అనే పేరుతో 2022లో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీని ప్రారంభించారు. నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ కాలంలో ఏడాదికి 15 వేలు జీతం ఇస్తామని ప్రకటించారు. ఏడాది శిక్షణ పూర్తి చేసుకున్న వారికి తాము ఇచ్చే అనుభవ సర్టిఫికెట్‌తో మల్టీ నేషనల్ కంపెనీ (ఎంఎన్‌సి) లలో ఉద్యోగాలు వస్తాయని ఆశలు కల్పించారు. ఒక్కొక్కరి నుంచి లక్షన్నర నుంచి ఆరు లక్షల వరకు వసూలు చేశారు. ఐటి రంగంలో నెలకొన్న ఒడుదొడుకులు, దేశ విదేశాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ అవకాశాలు సన్నగిలుగుతున్న నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు డిమాండ్ పెరిగింది. ఈ పరిస్థితుల్లో నిరుద్యోగులు ఇటువంటి కంపెనీలను ఆశ్రయిస్తున్నారు. గుంటూరు నగరంలోని అమరావతి రోడ్‌లో ఏర్పాటు చేసిన డెవలప్ ట్రీస్ సంస్థలో ఒక్క గుంటూరు జిల్లాతో పాటు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగులు ఈ సంస్థలో చేరినట్లు తెలుస్తోంది. ఈ సంస్థలో ముందుగా చేరే సమయంలో వారు ఒప్పందం చేసుకుంటారు. వారు నేర్చుకునే కోర్సును బట్టి శిక్షణ కాలం మూడు నెలల నుంచి ఆర్నెల్ల వరకు పేర్కొంటారు. మరి కొన్ని కోర్సులైతే ఏడాది కూడా ఉంటుంది. ముందుగా ఒక్కొక్కరి వద్ద ఒక్కో విధంగా డబ్బు కట్టించుకున్నారు ఒక్కొక్కరు లక్షలన్నర నుంచి రూ.6 లక్షల వరకు చెల్లించారు. వ్యక్తిగతంగా కట్టిన వారు కొందరైతే, కన్సల్టీల నుంచి వచ్చిన వారు ఎక్కువ మంది ఉన్నారు. అందరికీ ఆన్లైన్లోనే శిక్షణ ఇచ్చారు. గుంటూరులోని సంస్థ కార్యాలయంలో మాత్రం సుమారు వంద నుంచి 150 మంది వరకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సాఫ్ట్వేర్‌కు సంబంధించి పైథాన్, డిజంగ్, జావా వంటి కోర్సుల్లో శిక్షణ కొనసాగింది. శిక్షణ సమయంలో నెలకు 15 వేలు రూపాయల జీతం ఇస్తామని, ఆ తర్వాత ప్రాజెక్టు వర్క్ లో చేరాక అందులో తగిన జీతం ఇస్తామంటూ చెప్పుకొచ్చారు. అయితే శిక్షణ మాత్రం కొంతవరకు పక్కాగా ఇచ్చినప్పటికీ ఈ సంస్థలో శిక్షణ తీసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు వస్తాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. మూడు, నాలుగు నెలలుగా జీతాలు పూర్తిగా నిలిపేయడంతో నిరుద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఇదిలా ఉంటే వారం రోజుల నుంచి శ్రావణ్ చౌదరి అజ్ఞాతంలోకి వెళ్లాడని, కార్యాలయానికి బాధితులు క్యూ కడుతుండడంతో ఆయన సతీమణి ముక్కు స్వర్ణను పంపించాడన్నారు. కాగా ముక్కు స్వర్ణను అరండల్ పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంస్థ గురించి, ఆమె భర్త గురించి అడిగితే తన భర్త సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అని తనను పెళ్లి చేసుకున్నట్లు ఆమె తెలిపారు. అరండల్‌పేట సీఐ కొంకా శ్రీనివాసరావు మంగళగిరిలోని డ్రోన్ సమ్మిట్ కార్యక్రమం బందోబస్తుకు వెళ్లడంతో ఎస్పీ ఆదేశాల మేరకు పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు బాధితులతో మాట్లాడారు. **కంపెనీ నిర్వాహకులపై అరండల్ పేట పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు.**

నిండుకున్న 'ట్రిపుల్ వ్యాక్సిన్'

- ఆరోగ్యశాఖకు నిలిచిపోయిన డీపీటీ టీకా
- త్వరలో వస్తాయంటున్న వైద్యాధికారులు
- చిన్నారులకు పొంచి ఉన్న అంటువ్యాధుల ముప్పు

గుంటూరు మెడికల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పుట్టిన మొదటి రోజే చిన్నారులకు మూడు రకాల అంటువ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు ఇచ్చే ట్రిపుల్ వ్యాక్సిన్ డీపీటీ టీకా మందు వైద్య ఆరోగ్య శాఖలో నిండుకుంది. గత నెల రోజులుగా ఈ టీకాల పంపిణీ జిల్లాకు నిలిచిపోయింది. దీంతో చిన్నారులకు ఈ వ్యాక్సిన్ అందటం లేదు. ప్రమాదకరమైన కంఠసర్పి (డిఫ్తీరియా), కోరింత దగ్గు (పెర్ట్యుసిస్), ధనుర్వాతం (టెటనస్) వ్యాధుల నుంచి డీపీటీ టీకా మందు పూర్తి రక్షణ కల్పిస్తుంది. ఇవన్నీ అంటువ్యాధులు. పిల్లల్లో ఒకరి నుంచి మరొకరికి సులువుగా వ్యాప్తి చెందే స్వభావం గల వ్యాధులు. డిఫ్తీరియా ప్రాణాంతక వ్యాధి. ఇది గొంతుకు సోకే ఇన్‌ఫెక్షన్. ఈ వ్యాధి బారినపడ్డ పిల్లల్లో శ్వాస సమస్యలు, పక్షవాతం, గుండె పనితీరు మందగించడంతోపాటు అంతిమంగా మృత్యువు బారిన పడతారు. ధనుర్వాతం కూడా ప్రాణాంతక వ్యాధే. గాయమైన ప్రాంతంలో బ్యాక్టీరియా ప్రవేశించి ధనుర్వాతం కలిగిస్తుంది. వ్యాధి సోకిన పిల్లలు విల్లు ఆకారంలో వంగిపోతారు. దీంతో దీనికి ఆ పేరు వచ్చింది. సకాలంలో చికిత్స ఇవ్వకపోతే పిల్లలు మృతి చెందుతారు. కోరింత దగ్గు ప్రధానంగా శ్వాస కోశ వ్యాధి, జలుబు లక్షణాలు ఉంటాయి. వ్యాధి తీవ్రత వల్ల చిన్నారులు విపరీతమైన దగ్గుతో సతమతం అవుతారు. ఇలాంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వాస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డీపీటీ వ్యాక్సిన్ వేస్తారు. చిన్నారులకు ఐదేళ్ల వయస్సు వచ్చే నాటికి మొత్తం ఐదుసార్లు ఇంజెక్షన్ రూపంలో డీపీటీ వ్యాక్సిన్‌ను ఇస్తారు. పుట్టిన మొదటి రోజు నుంచి ఆరు వారాల మధ్య, 10 వారాలు, 14 వారాల వయస్సులో మూడు ద ఫాలుగా ఈ టీకా మందును ఇస్తారు. అనంతరం 16 నెలల నుంచి 24 నెలల్లో మొదటి బూస్టర్ డోస్, 5-6 సంవత్సరాల్లో రెండో బూస్టర్ డోస్ టీకాను సూచిస్తారు. దీనివల్ల పిల్లలకు ఈ మూడు వ్యాధుల నుంచి పూర్తి రక్షణ లభిస్తుంది.



డీపీటీ వ్యాక్సిన్

మార్కెట్‌లోనూ లభించని పరిస్థితి

జిల్లాలోని బహిరంగ మార్కెట్‌లో డీపీటీ వ్యాక్సిన్‌లు అందుబాటులో లేవు. కొన్ని చోట్ల అరకొరగా దొరుకుతున్నా ఆయా వ్యాక్సిన్‌ల పొటెన్సీ సరిగ్గా ఉండదని వైద్య నిపుణులే చెబుతున్నారు. ప్రైవేటు వైద్యశాలల్లో ఈ టీకాలకు పెద్ద మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా చిన్నారులందరికీ ఉచితంగా డీపీటీ వ్యాక్సిన్ ఇస్తున్నారు. నెల రోజులుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు డీపీటీ టీకాల పంపిణీ నిలిచిపోయింది. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి సంబంధించి గన్నవరంలోని స్టేట్ వ్యాక్సిన్ స్టోర్స్‌కు పంపుతుంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నుంచి ఈ వ్యాక్సిన్ పంపిణీ నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా అవసరాలకు ఏటా 26 వేల డోసులు అవసరం. ఇంతపెద్ద సంఖ్యలో వ్యాక్సిన్‌లు అవసరమైనా జిల్లా ఆరోగ్య శాఖకు అందటం లేదు. దీంతో నెల రోజులుగా చిన్నారులకు డీపీటీ వ్యాక్సినేషన్ నిలిచిపోయింది.

ఏడాదిలోపు ఇవ్వొచ్చు: డీఐవో

జిల్లాకు డీపీటీ వ్యాక్సిన్ పంపిణీ నిలిపోయిన విషయం వాస్తవమేనని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ స్థాయి నుంచే పంపిణీ తాత్కాలికంగా నిలిచిపోయినట్లు తెలిపారు. తొలిరోజుల్లో వ్యాక్సిన్ ఇవ్వకపోయినా ఏడాది వయస్సు లోపు పిల్లలకు ఈ వ్యాక్సిన్ ఇవ్వచ్చని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. త్వరలో డీపీటీ వ్యాక్సిన్‌లు జిల్లాకు అందుతాయని తెలిపారు.

ఎన్నాళ్లీ విద్యావేదన!

- నాలుగు విడతలుగా నిలిచిన ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా రూ.160 కోట్ల మేర బకాయిలు
- అప్పులు చేసి ఫీజులు చెల్లించిన తల్లిదండ్రులు
- ఎంతకీ బకాయిలు రాకపోవడంతో వారిలో కలవరం

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న విద్యా దీవెన తాలూకు వేదన ఈనాటికి విద్యార్థులను వెంటాడుతోంది. ఎప్పటి నుంచో అమలులో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన పేరుతో 'జగనన్న విద్యాదీవెన'గా మార్చి ఫీజులు చెల్లించకుండా విద్యార్థులను, వారి కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టారు. వాటి తాలూకా సమస్యలు ఇప్పటికీ విద్యార్థులను వెంటాడుతూనే ఉన్నాయి.

దాదాపు 83 వేల మంది విద్యార్థులు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ మీద ఆధారపడి చదువుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు దాదాపు 83 వేల మంది ఉన్నారు. ఈ ఏడాది ఈ సంఖ్య మరో 13 వేలు పెరిగింది. కొత్తగా ఈ ఏడాది చేరిన విద్యార్థులు మినహా పాత విద్యార్థులందరికీ కిందటేడాది ఫీజులకు సంబంధించి మూడు దఫాల ఫీజు రీయింబర్స్‌మెంట్ రావాల్సి ఉంది. ఈ ఏడాది తొలి మూడు నెలలు గడిచిపోవడంతో నాలుగో విడత ఫీజు చెల్లింపు కూడా బకాయిగా మారింది. దీంతో పాత వారికి సంబంధించి నాలుగు దఫాలు, కొత్తవారికి సంబంధించి ఒక దఫా ఫీజులు రావాల్సి ఉంది. మొత్తంగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి సుమారు రూ.160 కోట్ల మేర ఫీజు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. గత నాలుగు దఫాలుగా ఫీజులు రాకపోవడంతో కళాశాలల నిర్వహణే సమస్యగా మారింది.

విద్యార్థుల కుటుంబాలకూ తప్పని కష్టాలు

గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని 'విద్యాదీవెన' పేరుతో తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేసే కార్యక్రమం చేపట్టింది. దీని కారణంగా విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఫీజులు పడతాయి కనుక, వాటితో తమకు సంబంధం లేదని కళాశాలల యాజమాన్యాలు పట్టుపట్టాయి. 'విద్యాదీవెన పడితే ఆ డబ్బు మీరే తీసుకోండి.. ముందు మాకు కట్టాల్సిన ఫీజు బకాయి చెల్లించండి' అని పట్టుపట్టారు. వారి సర్టిఫికెట్లు ఆపేసి ఫీజులు వసూలు చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కట్టి తమ బిడ్డల సర్టిఫికెట్లు తెచ్చుకున్నారు. వారు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వారికి ఊరట లభించకపోవడంతో కలవరం చెందుతున్నారు.

ప్రభుత్వంపై గత బకాయిల మోత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించింది. కానీ ఫలితం లేకపోయింది. గత ప్రభుత్వంలో చెల్లించాల్సిన ఫీజు బకాయిలు చెల్లించడానికే ఏం చేయాలో తెలియని స్థితిలో పడింది. తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా రూ. 643 కోట్లు విడుదల చేసింది. అవి పాత బకాయిల చెల్లింపుల్లో ఒక్క మూలకి కూడా రాలేదు. దీంతో ఆ తరువాత కూటమి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తని పరిస్థితి. దీంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పద్దు మరింత పెరిగింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యాసంస్థల గుండెల్లో గుబులుగా మారింది.

దోపిడీ దొంగలు అరెస్టు

బాపట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మేదరమెట్ల హైవే రోడ్డులోని కొరిశపాడు ఫ్లైఓవర్ దగ్గర బంగారు వ్యాపారిని బెదిరించి రూ. 39 లక్షల 50 వేలు దోచుకున్న దోపిడీ దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కాటూరు పంచాయతీకి చెందిన ధనికొండ వెంకన్నస్వామి గతంలో విజయవాడ వెంకటరమణ ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఆ సమయంలో చెన్నై వెళ్లే లారీల్లో డ్రైవింగ్‌కు వెళ్లే సమయంలో గుంటూరు, చిలకలూరిపేట, వలపర్ల ప్రాంతాల్లో బంగారు వ్యాపారస్తులు చెన్నైలో బంగారం కొనటానికి పెద్దమొత్తంలో డబ్బులు తీసుకొని వెళ్లడాన్ని గమనించాడు. ఏదైనా లారీని ఎంచుకొని అందులో వ్యక్తులను బెదిరించి డబ్బులు దొంగిలించాలని పథకం రూపొందించుకున్నాడు. అనుకున్న విధంగా ఏప్రిల్ 18న విజయవాడలోని ట్రావెల్స్ నందు కారు అద్దెకు తీసుకొని తనతోపాటు మరో ముగ్గురిని కలుపుకుని విజయవాడ వెంకటరమణ ట్రావెల్స్ వారి మినీలారీని అనుసరించారు. గుంటూరులో తల్లం స్వరూప్ కుమార్ కర్రల సంచితో లారీ ఎక్కటం వారు గమనించారు. దీంతో లారీని అనుసరిస్తూ, అర్ధరాత్రి 1 గంటకు మేదరమెట్ల ఎన్‌హెచ్16, కొరిశపాడు ఫ్లైఓవర్ దగ్గరలో లారీకి కారు అడ్డం పెట్టి టార్చ్‌లైట్‌తో రోడ్డు పక్కన ఆపించి డ్రైవర్, స్వరూప్ కుమార్‌ను బెదిరించారు. అనంతరం స్వరూప్ కుమార్‌ను కొట్టి కారులో ఎక్కించుకొని కొంతదూరం తీసుకెళ్లి అతని వద్ద ఉన్న డబ్బులు, మొబైల్ తీసుకున్నారు. అనంతరం రోడ్డుపై వదిలి వెళ్లిపోయారు. ఈ సంఘటనలో ధనికొండ వెంకన్నస్వామితోపాటు పగడాల మహేష్, టెంటు కార్తీక్, పూరేటి శ్రీనివాసరావు ఉన్నారు. నలుగురు కలిసి దోపిడీ చేయడంపై గుంటూరుకు చెందిన బాధితుడు తల్లం స్వరూప్ కుమార్ అద్దంకి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన సీఐ డి.మల్లికార్జునరావు, ఎస్సై ఎస్‌కె.మహ్మద్‌రఫీ, సిబ్బంది సాయంతో సోమవారం మేదరమెట్ల జంక్షన్ వద్ద నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న రూ. 39 లక్షల నగదు, వాహనం, టార్చ్‌లైట్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ధనికొండ వెంకన్నస్వామి, టెంట్‌కార్తీక్ గతంలో పలు కేసుల్లో నేరస్తులుగా ఉన్నారు. కేసును ఛేదించిన పోలీసులకు ఎస్పీ అభినందనలు తెలిపి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్, అద్దంకి రూరల్ సీఐ డి.మల్లికార్జునరావు, సీసీఎస్ సీఐ ప్రేమయ్య, మేదరమెట్ల ఎస్సై మహ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్సై వై.సురేష్, జె.పంగులూరు ఎస్సై బి. వినోద్‌కుమార్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేల టపాకాయల తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలో నేల టపాకాయలు తయారీ కేంద్రంపై మంగళవారం పోలీసులు ఆకస్మిక దాడి చేసి ఒకరిని అరెస్టు చేశారు. చేబ్రోలు పోలీసు కథనం ప్రకారం డీఎస్పీ బి.జనార్దనరావు పర్యవేక్షణలో సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్సై డి.వెంకట కృష్ణ, రెండు బృందాలుగా విడిపోయి టపాసుల కేంద్రంపై దాడులు చేశారు విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు చేబ్రోలు మండలం గరువుపాలెం గ్రామంలో ఒక ఇంటిలో ఇద్దరు వ్యక్తులు నేల టపాకాయలు తయారు చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దాడి సమయంలో పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారైయ్యాడు. శేకూరు గ్రామానికి చెందిన బూరగ సైదాను అదుపులోకి తీసుకున్నారు. సైదాతో పాటు అతని స్నేహితుడు నారాకోడూరు గ్రామానికి చెందిన ముప్పవరపు సంజయ్ సారథి కలిసి పది రోజులుగా నేల టపాకాయలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. సంఘటనా స్థలంలో 20 ప్యాకెట్ల నేల టపాకాయలు, టపాకాయలు తయారీకి వినియోగించే రాళ్లు, పేపర్, గుడ్డ ముక్కలు, ఒక కిలో మందును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట కృష్ణ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నేల టపాకాయలు

యువతి బ్రెయిన్ డెడ్ కేసులో నిందితుడు అరెస్టు

తెనాలి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించిన యువతిని గర్భవతిని చేయడమే కాకుండా ఏం చేద్దామని ప్రశ్నించిన తనను కొట్టి బ్రెయిన్ డెడ్ కావడానికి కారణమైన నిందితుడు రాగి నవీన్‌ను టు టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఐతానగర్‌కు చెందిన మదిర సహన ప్రకాశం రోడ్డులోని తరంగ అనే వినికిడి పరీక్ష కేంద్రంలో సహాయకురాలిగా పని చేస్తుంది. కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన రాగి నవీన్ అనే వ్యక్తితో ప్రేమలో పడింది. ఆరేళ్లగా వీరిద్దరి మధ్య పరిచయం ఉందని, అప్పుడప్పుడు శారీరకంగా కలవడం, కొంత డబ్బు కూడా ఇచ్చింది. ఈ క్రమంలో యువతి గర్భం దాల్చడంతో ఏం చేద్దామని అడిగిన నవీన్‌తో గొడవ కావడం. ఇచ్చిన డబ్బులు కూడా అడిగింది. ఈ నెల 19న కారులో ఎక్కించుకుని కఠెవరం గ్రామ శివారుకు తీసుకు వెళ్లిన సమయంలో గొడవ జరిగి యువతిని కొట్టి తలను కారు డోరుకు విసరడంతో బలమైన గాయం కావడంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లి యువతి తల్లి అరుణకుమారికి సమాచారం ఇచ్చాడు. మెరుగైన వైద్యం కోసం యువతిని ఆమె తల్లి మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తీసుకు వెళ్లింది. అరుణకుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బృందాలను ఏర్పాటు చేసి ముద్దాయి కోసం గాలించి మంగళవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు, సీఐ నిస్సార్‌బాషా

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1.98 లక్షల విరాళం

గుంటూరు(విద్య), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డులో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు వరద బాధితులకు తమవంతు వితరణ ప్రకటించారు. మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడును కలిసి రూ.1.98 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ, ఇంటర్ బోర్డు విశ్రాంత ఉద్యోగులు మనోహర్‌రెడ్డి, రమేష్, ప్రకాశరావు, పుండరీకాంక్షులు తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న ఇంటర్ బోర్డు విశ్రాంత ఉద్యోగులు, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ

స్టడీ మెటీరియల్ పంపిణీకి నిర్ణయం

గుంటూరు సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ అందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మంగళవారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈవో వి.జ్యోతి బసు ఆధ్వర్యంలో మూడు జిల్లాల విద్యాశాఖ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా మాట్లాడుతూ పేద విద్యార్థులకు అందించే విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ డిసెంబరు 10లోగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరం 34,573 మందికి స్టడీ మెటీరియల్ అవసరం ఉందన్నారు. ఈ సంవత్సరం 100 శాతం పాస్ పర్సంటేజ్ సాధించేలా స్టడీ మెటీరియల్ ఉండాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిష్ణాతులైన అధ్యాపకులతో మెటీరియల్ తయారు చేయించాలని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ, మూడు జిల్లాల డీఈవోలు పాల్గొన్నారు.



విద్యాజ్యోతిపై సమీక్షిస్తున్న చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, చిత్రంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సీఈఓ జ్యోతి బసు

రాజకీయాల్లో మంచిని శేషంగా పొందడం అరుదైన ఘనత

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి శివాజీ తాను జై ఆంధ్ర ఉద్యమంలో కలిసి పనిచేశామని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు చెప్పారు. రాజ్యసభ మాజీ సభ్యుడు, రైతు నాయకుడు యలమంచిలి శివాజీని పరామర్శించేందుకు మంగళవారం ఆయన గుంటూరు వచ్చారు. తాడికొండ మండలం మోతడక గ్రామంలో ఒక ఫంక్షన్‌కు వచ్చిన ఆయన యలమంచిలి ఆరోగ్య సమస్యతో బాధ పడుతున్నారని తెలిసి ఆయన ఇంటికి వెళ్లి పలకరించారు. సమకాలికులైన మిత్రులతో కలిసి తమ జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మీడియాతో మాట్లాడారు. యలమంచిలి శివాజీ రాజకీయంగా తనకు సీనియర్ అని, జై ఆంధ్ర ఉద్యమంలో ఆయనతో కలిసి పనిచేశామని తెలిపారు. యలమంచిలి శివాజీ రాజకీయాల్లో ఉంటూ మంచి రాజకీయ నాయకుడిగా విశ్రాంత జీవితం గడపడం గొప్ప విషయమన్నారు. రాజకీయాల్లో మంచిని శేషంగా పొందడం అరుదైన ఘనత అని, అది యలమంచిలి శివాజీకే సాధ్యమయిందని అన్నారు. ఆయన అలా సాధించడానికి కారణం సిద్ధాంతపరమైన రాజకీయాలేనన్నారు. ప్రస్తుతం అవకాశవాదం, కులం, ప్రాంతీయ విద్వేషాలపై రాజకీయాలు చేస్తున్నారన్నారు.



యలమంచిలి శివాజీతో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

దానా తుపానుతో 11 రైళ్ల రద్దు

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి తుపానుగా మారనుండటంతో రైల్వే శాఖ అప్రమత్తమైంది. పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెల 23వ తేదీన బయలుదేరే సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్, సిల్చార్ - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు - భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ - హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశామని డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. అలానే ఈ నెల 24వ తేదీన బయలుదేరే హౌరా - సికింద్రాబాద్ ఫలక్‌నుమా, షాలిమార్ - వాస్కోడిగామ, సికింద్రాబాద్ - మాల్దాటౌన్ ప్రత్యేక రైలుని రద్దు చేశామన్నారు. ఈ నెల 25వ తేదీన బయలుదేరే భువనేశ్వర్ - సికింద్రాబాద్, భువనేశ్వర్ - బెంగళూరు సిటీ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26న బయలుదేరే సికింద్రాబాద్ - సిల్చార్ ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేశామని చెప్పారు.

ఆరు రైళ్లకు రెండు అదనపు జనరల్ భోగీలు

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరు ప్యాసింజర్ రైళ్లకు నెలపాటు రెండు అదనపు జనరల్ భోగీలను జత చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07783 విజయవాడ - గుంటూరు, 07788 గుంటూరు - విజయవాడ, 07579 నడికుడి - మాచర్ల, 07580 మాచర్ల - నడికుడి, 07779 గుంటూరు - మాచర్ల, 07780 మాచర్ల - గుంటూరు ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 23వ తేదీ నుంచి నవంబరు 23వ తేదీ వరకు రెండు అదనపు జనరల్ భోగీలతో నడుపుతామని పేర్కొన్నారు.

సాగునీటి రంగంపై నేడు సీఎం సమీక్ష

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సాగునీటి రంగంపై సీఎం చంద్రబాబు బుధవారం సమీక్షించనున్నారు. పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తదితర పథకాలపై ముఖ్యమంత్రి సమీక్షిస్తారు. పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రమ్‌వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులను ప్రారంభించాల్సి ఉంది. ఈ పనులు చేపట్టాల్సిన బావర్ డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులకు గడువు కోరుతోంది. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులు పూర్తి చేసేందుకు నాలుగేళ్లు పడుతుందని చెబుతోంది. వీటిపైనా సమీక్షించనున్నారు.

31 వరకు గడువు పొడిగింపు

గుంటూరు సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిర్వహించే ప్రవేశ, వర, ప్రవర ఆగమ అర్చక పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31 వరకు గడువు పెంచుతూ దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశాలు ఇచ్చినట్లుగా అర్చక జేఏసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

28,133 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 30,429 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 28,133 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 24,612 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16500	334	8500	15500
నెంబరు.5	8500	15000	నెంబరు. 5	10000	12500
273	10000	13500	273	11000	14000
341	9000	16000	341	9000	16000
4884	--	--	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8500	18600	తేజ	8500	18500
బ్యాడిగి	9000	15500	బ్యాడిగి	8500	15000
దేవనూరు డీలక్స్	8500	16000	దేవనూరు డీలక్స్	9000	15500
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	10500

29 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 29, 30 తేదీలలో స్థానిక బీఆర్ స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగులకు పలు క్రీడాంశాల్లో పోటీలు, ఎంపికలు నిర్వహిస్తున్నట్లు చీఫ్ కోచ్ పి.నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో భాగంగా 29న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, శరీర సౌష్టవం 30న హాకీ, కబడ్డీ, టెన్నీస్, పవర్ లిఫ్టింగ్, టెబుల్ టెన్నీస్, వాలీబాల్, రెస్లింగ్, స్విమ్మింగ్, మ్యూజిక్, డ్యాన్స్ పోటీలు జరుగుతాయని అన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు వచ్చే నెల 6 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 94418 18491 అనే నెంబరును సంప్రదించాలని సూచించారు.

కుచేలోపాఖ్యానంపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణవేదికపై శ్రీమద్భాగవతం ధారావాహిక ప్రవచనాలలో భాగంగా బ్రహ్మశ్రీ మల్లాది కైలాసనాథ్‌చే కుచేలోపాఖ్యానంపై జరుగుతున్న ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం రెండో రోజున సాగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కైలాసనాథ్ ప్రవచిస్తూ శ్రీకృష్ణుడు భక్తులను ఎలా అనుగ్రహిస్తాడు? అని తెలిపే కథ కుచేలోపాఖ్యానమన్నారు. నేటి తరం యువతకు ఈ కథ అనేక సందేశాలను అందిస్తుందన్నారు. స్నేహం, గురువు ప్రాముఖ్యత, ఆత్మాభిమానంతో బతకటం ప్రాముఖ్యతను ఈ కథ తెలియజేస్తుందన్నారు.



ప్రవచనం చేస్తున్న మల్లాది కైలాసనాథ్

పాలనా వ్యవస్థను పరుగులు పెట్టించిన ఘనత శంకరన్‌దే

గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సామాన్యుల చెంతకు పాలనా వ్యవస్థను పరుగులు పెట్టించిన ఘనత రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, దివంగత ఎస్ఆర్ శంకరన్‌దేనని విశ్రాంత ఇంజనీర్ ఎస్.సదాశివం తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం ఎస్ఆర్ శంకరన్ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరన్ తన జీవితంలో అట్టడుగు వర్గాల, దళితుల అభివృద్ధి కోసం నిర్విరామంగా కృషి చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇళ్ల స్థలాల భూముల కేటాయింపునకు శంకరన్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. అనంతరం శంకరన్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఎస్వీ సత్యనారాయణ, వీవీ రావు, విద్యాధరకుమార్, రామకృష్ణారెడ్డి ఉన్నారు.

ఆయుర్వేదిక్ వైద్యుడు దివి హరిప్రసాద్ మృతి



డాక్టర్ హరిప్రసాద్

గుంటూరు మెడికల్, అక్టోబరు 22 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ ఆయుర్వేదిక్ వైద్యుడు దివి హరిప్రసాద్ సోమవారం కృష్ణనగర్‌లోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. విజయవాడ ఆయుర్వేదిక్ వైద్య కళాశాలలో 35 ఏళ్లపాటు ఆయన సేవలు అందించి కొన్నేళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగం నుంచి రిటైరైన తర్వాత కూడా ఆయన ఆరోగ్య భారతి, సేవా భారతి సంస్థల ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందించారు. డాక్టర్ హరిప్రసాద్ ఆయుర్వేద వైద్య రంగానికి అందించిన సేవలు వెలకట్టలేవని పలువురు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశాం: ఆలయ ఈవో

పెదకాకాని, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శివాలయంలో పూజకు కుళ్లిపోయిన కొబ్బరికాయలు సరఫరా చేస్తున్న దేవస్థానం కాంట్రాక్టర్ హరీష్‌కు నోటీసులు జారీ చేసినట్లు ఆలయ ఈవో గోగినేని లీలా కుమార్ తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తపై ఆలయ ఉపకమిషనరు లీలా కుమార్ వివరణ ఇచ్చారు. పత్రికలో వచ్చిన వార్త విషయమై దేవస్థానంలోని కొబ్బరిచెక్కలు సేకరించే లైసెన్సు హక్కుదారులైన బత్తుల భాస్కరరావు ఫిర్యాదుపై కొబ్బరికాయల షాపు లైసెన్సుదారునికి, సదరు దేవస్థానానికి కొబ్బరికాయలు సరఫరా చేసే లైసెన్సుదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వారిద్దరి నుంచి వచ్చే లిఖితపూర్వక సమాధానంను పరిశీలించి తగు శాఖపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.



నందివెలుగు రోడ్డులో ఎక్కడికక్కడ ఏర్పడిన భారీ గుంతలు

నందివెలుగు రోడ్డులో ప్రయాణం నరకం

- గుంతలతో వాహనదారులకు ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్ అండ్ బీ శాఖ

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం నుంచి నందివెలుగు వెళ్లే రహదారి ఎక్కడికక్కడ గుంతలతో నిండిపోయింది. ముఖ్యంగా కొలకలూరు వంతెన మొదలుకొని వెంకటకృష్ణాపురం వరకు భారీ సైజు గుంతలు ఏర్పడటంతో నిత్యం ద్విచక్ర వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితి. పగలైతే ఎలాగోలా ప్రయాణిస్తున్నారు. రాత్రి వేళ ఆ గుంతలు కనిపించక వాహనాలపై ప్రయాణిస్తూ అదుపుతప్పి కిందపడి గాయాలు పాలౌతున్నారు. కొలకలూరు, నందివెలుగు, ఈమని, వెంకటకృష్ణాపురం తదితర గ్రామాలకు చెందిన అనేకమంది నిత్యం పనుల కోసం గుంటూరుకు వచ్చి వెళుతుంటారు. రాత్రి వేళ వీరంతా ప్రయాణిస్తుండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిత్యం వీవీఐపీలు కూడా ఈ మార్గంలోనే ప్రయాణిస్తున్నా కనీసం ఆర్ అండ్ బీ శాఖ పట్టించుకోవడం లేదు. అనేకమార్లు ఫిర్యాదులు చేసినా నిధుల కొరత సాకు చూపిస్తూ ఆ డిపార్టుమెంట్ చేతులెత్తేస్తున్నది. ప్రజలతో తనకేమి సంబంధం లేదన్నట్లుగా ఆ శాఖ ఉంటుందని సాక్ష్యాత్తు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం జిల్లా విజన్ రూపకల్పన సమావేశంలో తలంటారు. నిధుల కొరత ఉన్నా ప్యాచ్‌వర్కులు చేయాల్సిందేనని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను కూడా ఆ శాఖ పెడ చెవిన పెడుతున్నది.

దీపావళి బాణ సంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

- నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు
- ఎస్పీ సతీష్‌కుమార్



గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గోడౌన్స్, విక్రయించే దుకాణాలకు తప్పనిసరిగా అనుమతి ఉండాలని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. షాపు నిర్వాహకులు పోలీసు అధికారులు, ఫైర్ డిపార్టుమెంట్ వారు సూచించిన నియమ నిబంధనలు, జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. షాపు యజమానులు నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దీపావళి బాణసంచా తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గోడౌన్స్, విక్రయించే దుకాణాలకు తప్పనిసరిగా అనుమతి ఉండాలని, సూచించిన నిబంధనలను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రాబోయే దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యల గురించి ఎస్పీ సతీష్ కుమార్ వివరించారు. గతంలో వివిధ ప్రదేశాలలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రజల శ్రేయస్సు కొరకు బాణాసంచా తయారీ కేంద్రాలకు, నిల్వ చేసే గోడౌన్లకు, విక్రయించే దుకాణాలకు నియమ నిబంధనలు సూచించడం జరిగిందన్నారు.

బాణాసంచా నిల్వచేసే గూడెం నిర్వాహకులు, తయారీ, విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. బాణసంచా సామగ్రి తయారీ, నిల్వ కేంద్రాలు, నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలన్నారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవలసిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాణాసంచా విక్రయ దుకాణాలు అధికారులు సూచించిన ప్రదేశంలోనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. జనావాసాలకు, విద్యాసంస్థలకు, హాస్పిటల్స్ కు దూరంగా బాణాసంచా విక్రయాలు జరగాలన్నారు. ప్రతి దుకాణం వద్ద రెండు అగ్ని నిరోధక సిలెండర్లు, రెండు బక్కెట్ల పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లాలో బాణసంచా తయారీ, విక్రయాలు చేసే వారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండి నియమ నిబంధలకు లోబడి బాణసంచా విక్రయించాలన్నారు. లైసెన్సులు లేకుండా ఎవరైనా మందుగుండు సామగ్రి తయారు చేసినా, నిల్వ చేసినా, విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలోని పోలీస్ అధికారులు వారి పరిధిలో ఏర్పాటు చేసిన బాణసంచా తయారీ, విక్రయ దుకాణాలను, నిల్వ ఉంచిన గోదాములను తనిఖీ చేయాలన్నారు. ఎవరైనా నిబంధనలను పాటించని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా సామగ్రి అక్రమ విక్రయాలు, నిల్వలకు సంబంధించిన సమాచారం ఉంటే డయల్ 100, 112 లేదా గుంటూరు జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 86888 31568 ఫోన్ చేసి సమాచారం తెలియచేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ సతీష్ కుమార్ తెలియజేశారు.



సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

నేడు నగరానికి సీఎం చంద్రబాబు రాక

- వెంకయ్యనాయుడు మనవడి నిశ్చయతాంబూలాల కార్యక్రమానికి హాజరు

గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం నగరానికి రానున్నారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డులో గల శ్రీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న మాజీ ఉప ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు మనవడి నిశ్చయ తాంబూలాల కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు హాజరు కానున్న నేపథ్యంలో సదరు ఫంక్షన్ హాల్ భద్రత ఏర్పాట్లను ఎస్పీ సతీష్ కుమార్, ఎస్బీ డీఎస్పీ సీతారామయ్య, సీఐ ఆళహరి శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : జంగాల

గుంటూరు(తూర్పు), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు రూ.20వేల పెట్టుబడి సాయం ఇస్తానని చెప్పి ఇప్పటివరకు దాని ఊసే ఎత్తలేదని విమర్శించారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తానన్న హామీపై నవంబరు 18న సచివాలయాల్లో అధికారులకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అకిటి అరుణ్‌కుమార్, కోటా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, పాల్గొన్న అకిటి అరుణ్‌కుమార్ తదితరులు

మెప్మా ద్వారా మహిళల జీవితాల్లో వెలుగు

తాడేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మెప్మా ద్వారా మహి ళల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని పట్టణ పేదరిక నిర్మూ లన సంస్థ (మెప్మా) మిషన్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి ఎస్ తేజ్ భరత్ అన్నారు. మంగళవారం తాడేపల్లి బైపాస్ రోడ్డులో మెప్మా కార్యాలయానికి విచ్చేసిన తెనాలికి చెందిన ఎస్‌హెచ్‌జి సభ్యురాలు సయ్యద్ నహారే నిగర్ సుల్తానా, గ్రూప్ సభ్యులను అభినందించారు. ఇటీవల అఖిలభారత్ సరస్ ఎగ్జిబిషన్‌లో విజయనగరంలో ఏపి నుండి మెప్మా ద్వారా 28 స్టాల్స్‌లో 47 స్వయం సహాయక సభ్యులు వారు తయారు చేసిన ఉత్పత్తులతో అన్ని జిల్లాల నుంచి వచ్చి ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారు. పది రోజులకు గాను మెప్మా స్వయం సహాయక సంఘ సభ్యులు ఉత్పత్తులు రూ.47,73,857ల అమ్మకాలు జరిగి తద్వారా రూ.9,14,771లు లాభం వచ్చింది. ఈ మొత్తం లాభంలో తెనాలికి చెందిన నిగర్ సుల్తా నా, సుభానల్లా, ఎస్‌హెచ్‌జి సంఘ సభ్యురాలు తయారు చేసిన క్రిస్టల్ బ్యాగ్ ఆర్టిఫీషియల్ జ్యూయలరీ ఉత్పత్తుల ద్వారా రూ.2,67,000లు అమ్మకాలు చేసి ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న ఎస్‌హెచ్‌జీలే అందరి కన్నా అధికంగా అమ్మకం చేశారు. దీంతో తేజ్ భరత్ మాట్లా డుతూ వారి గ్రూప్ ఒక యూనిట్ పెట్టుకునేలా ఏర్పాట్లు చేస్తామని అభినందించారు.

పారదర్శకంగా మద్యం షాపుల టెండర్లు

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు



డాక్టర్ కే శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గుంటూ రు, పల్నాడు జిల్లాలలో మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించామని గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. రెండు జిల్లాలలో మద్యం షాపుల నిర్వహణ, ఏర్పాట్లు, రాజకీయ వత్తిళ్లపై ఆయన 'ఆంధ్రజ్యోతి' మాట్లాడారు.

పల్నాడు, గుంటూరు జిల్లాలలో కొన్నిచోట్ల మద్యం షాపులో తెరవలేదు ఎందుకని?

డీసీ : రెండు జిల్లాలలో మొత్తం 256 మద్యం షాపులకు టెండర్లు నిర్వహించాం. లాటరీ ద్వారా లైసెన్స్ దారులను ఎంపిక చేసాం. అందులో పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి లో-1, మాచర్లలో-2 షాపులు, గుంటూరు జిల్లా మంగళగిరిలో-2, తెనాలిలో-2, పొన్నూరు లో-1 చొప్పున షాపులు తెరవాల్సి ఉంది. అయితే ఆయా షాపులకు స్థలాలు దొరికినట్లు చెప్పారు. దీంతో రెండు జిల్లాలలో మొత్తం 7 షాపులను బుధవారం ప్రారంభిస్తున్నారు.



వాటాల కోసం రాజకీయ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని వస్తున్న ఆరోపణలు నిజమా?

డీసీ : రెండు జిల్లాలలో అటువంటిది ఏమీ లేదు. ఏ రాజకీయ నాయకుడు నాకు ఫోన్ చేయలేదు. అలాంటి ఆరోపణలు అవాస్తవాలు.

పోటీ పడి పక్క పక్కన షాపులు పెడుతున్నారు... గొడవలు అవుతున్నాయి ఆ సమస్య ఎలా పరిష్కరిస్తారు?

డీసీ : వ్యాపారం కోసం ప్రధాన సెంటర్లలో కొంతమంది లైసెన్సుదారులు పోటీ పడుతున్న మాట వాస్తవం. అయితే అటువంటి గొడవలను సీఐ, ఏఈఎస్, ఈఎస్‌లు పరిష్కరించాలని ఆదేశించాం. వారు ఆ పనిలో ఉన్నారు.

మద్యం వ్యాపారులకు పర్మినెంట్ లైసెన్స్ ఎప్పుడు ఇస్తారు?

డీసీ : మద్యం వ్యాపారులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండాలి. స్థల యజమానితో అద్దె అగ్రిమెంటు, డాక్యుమెంట్ సమర్పిస్తే అలాంటి వారికి వెంటనే సీఐ, ఈఎస్‌లు పరిశీలించి పర్మినెంట్ లైసెన్స్ జారీ చేస్తారు.

కొందరు సిఐలు రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతూ టెండర్ దారులను బెదిరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

డీసీ : ఆ విమర్శలు నిరాధారం. గుంటూరు, పల్నాడు జిల్లాలలో ఉన్న ఎక్సైజ్ సీఐలు నిబంధనల మేరకే పని చేస్తారు. ఏ రాజకీయ నాయకుడికి, ఏ వ్యాపారికి వత్తాసు పలకరు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ మద్యం షాపుల వ్యవహారంలో చాలా జాగ్రత్తగా మెసులుకుంటున్నారు.

రైతుల పాట్లకు ఈ - లాటరీ

- 23, 24 తేదీలలో మధ్యాహ్నం నుంచి కేటాయింపు

తుళ్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రాజధాని అమరావతి కోసం భూ సమీకరణ పథకంలో భాగంగా భూములను ఏపీ సీఆర్డీఏకి అప్పగించి ఇంకనూ ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందాల్సిన రైతులకు కేటాయించిన నివాస, వాణిజ్య ప్లాట్లకు ఈ నెల 23, 24 తేదీలలో అనగా బుధ, గురువారాలలో ఈ-లాటరీ జరుగుతుందని సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటనలో మంగళవారం తెలిపింది. అమరావతిలో సుమారు 20 గ్రామాలలో రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయిస్తారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ఏపీసీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ-లాటరీ జరుగుతుందని కార్యాలయ అధికారులు తెలిపారు.

20 గ్రామాలకు సంబంధించి 129 మంది రైతులకు గానూ 319 ప్లాటకు లాటరీ జరుగుతుందని తెలిపారు. 23వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు కురగల్లు, అబ్బరాజుపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, మల్కాపురం, ఉద్దండ్రాయునిపాలెం. 3 గంటల నుంచి 4 గంటల వరకు శాఖమూరు, తుళ్లూరు, మందడం లాటరీ పక్రియ జరుగుతుంది. 24వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నవులూరు, నిడమర్రు, 4 గంటల నుంచి 5 వరకు బోరుపాలెం, రాయపూడి, నెక్కల్లు నేలపాడు, వెలగపూడి, వెంకటపాలెం, అనంతవరం గ్రామాల రైతులకు లాటరీ పద్ధతిలో ప్లాట్లను కేటాయిస్తారని తెలిపారు.

జగన్ పర్యటనకు అనుమతిపై పోలీసుల పునరాలోచన

- శాంతి భద్రతల సమస్యపై నిఘా వర్గాల ఆరా
- నాడు రమ్య మృతదేహాన్ని సందర్శించకుండా టీడీపీ నేతలను అడ్డగించిన వైసీపీ వర్గీయులు
- ఇంటి వద్ద పరామర్శించడానికి వెళితే దాడికి యత్నించి టీడీపీ వారిపైనే కేసులు నమోదు

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా జీజీహెచ్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి కన్నుమూసిన సహన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వస్తున్న మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి అనుమతి ఇవ్వాలా లేదా అనే దానిపై పోలీసులు పునరాలోచనలో పడ్డారు. జగన్‌కు ఇప్పటికే అనుమతి ఇచ్చారు. అయితే జగన్‌కు అనుమతి ఇచ్చిన సమయంలో ఆమె వెంటిలేటర్‌పై ప్రాణాలతో ఉంది. అయితే మంగళవారం రాత్రి ఆమె తుది శ్వాస విడవడంతో బుధవారం ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నారు. సహన మృతి చెందిన నేపథ్యంలో ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు జగన్‌కు అనుమతి ఇస్తారా లేదా అనేదానిపై ప్రస్తుతం సస్పెన్స్ నెలకొంది. జగన్ పర్యటన నేపథ్యంలో శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమవుతుందా అనే కోణంలోనూ పోలీసులు ఆలోచిస్తున్నారు. దీనిపై ఇప్పటికే నిఘావర్గాలు ఆరా తీస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకాని రోడ్డులోని పరమాయకుంట వద్ద పట్టపగలు నడిరోడ్డుపై నల్లపు రమ్య అనే బీటెక్ విద్యార్థినిని యువకుడు ప్రేమ పేరుతో కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. దళితురాలైన నల్లపు రమ్య హత్యపై అప్పట్లో టీడీపీతో పాటు రాజకీయ పక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. అప్పట్లో రమ్య మృతదేహాన్ని సందర్శించి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు నారా లోకేశ్‌తో పాటు టీడీపీ నేతలు మార్చురీ వద్దకు రాగా వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, రౌడీలు వారిని అడ్డుకొని దాడికి యత్నించారు. దీంతో పోలీసులు లోకేశ్‌తో సహా టీడీపీ నేతలను మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించనివ్వకుండానే అక్కడి నుంచి పంపారు. అంతేగాక హడావుడిగా రమ్య మతదేహాన్ని కూడా ఆమె ఇంటికి తరలించారు. దీంతో టీడీపీ నేతలు ఇంటి వద్ద రమ్య మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లగా అక్కడ కూడా పోలీసులతోపాటు వైసీపీ నాయకులు టీడీపీ నేతలపై దౌర్జన్యం చేశారు. అంతేగాక టీడీపీ వారిపైనే కేసులు పెట్టారు. ఈ సందర్భంగా మార్చురీతో పాటు నల్లపు రమ్య ఇంటి వద్ద కూడా ఉద్రిక్త పరిస్థితిలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం జీజీహెచ్ మార్చురీ వద్ద సహనా మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు జగన్ వస్తున్న నేపథ్యంలో గొడవ జరిగే అవకాశం ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. శాంతి భద్రతల సమస్యల నేపథ్యంలో జగన్‌కు అనుమతి ఇవ్వాలా లేదా అనేదానిపై పోలీసులు పునరాలోచనలో పడ్డారు. దీనిపై మంగళవారం రాత్రి పోలీస్ ఉన్నతాధికారులు సమీక్షించారు. ఈ క్రమంలో బుధవారం మార్చురీ వద్దకు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా వచ్చే అవకాశం ఉంటుందని అనుమానిస్తున్నారు. అదే జరిగితే శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయని పోలీసు అధికారులు భావిస్తున్నారు. జగన్‌ను మార్చురీకి కాకుండా తెనాలిలోని ఆమె ఇంటి వద్ద పరామర్శించేలా అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. దీనిపై బుధవారం ఉదయం పోలీస్ అధికారులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

అమరావతి వైపు దేశం చూపు

- ఎమ్మెల్యే గల్లా మాధవి



ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి వేదికగా జరుగుతున్న జాతీయ స్థాయి డ్రోన్ సమ్మిట్‌తో దేశం చూపంతా అమరావతి వైపు మళ్లిందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన జాతీయ స్థాయి డ్రోన్ సమ్మిట్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దార్శనికుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితోనే అమరావతికి ఆ గౌరవం దక్కిందని తెలిపారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర రాజధాని హైదరాబాదుకు మైక్రో సాఫ్ట్ అధినేత బిల్ గేట్స్‌ను తీసుకువచ్చి ఐటీ కేంద్రంగా హైదరాబాదు ప్రపంచ పటంలో చోటు పొందే విధంగా కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, నేడు ఆంధ్రుల రాజధాని అమరావతికి తానే బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా, అమరావతిని భారతదేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దటానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో ఇంత పెద్ద సమ్మిట్ దేశ రాజధాని ఢిల్లీలో జరిగితే, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో జరుగుతోందని, అది ఈ రాష్ట్రం పట్ల ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. తద్వారా రాష్ట్ర అభివృద్ధితో పాటు, యువతకు నైపుణ్యం ఇచ్చి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గల్లా మాధవి చెప్పారు.

విజయవంతంగా ముగిసిన అంతర్జాతీయ వర్క్‌షాప్

- హాజరైన కేంద్రమంత్రి పెమ్మసాని, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అర్బన్ ల్యాండ్ రికార్డ్ కోసం సర్వే- రీ సర్వేలో ఆధునిక సాంకేతిక విధానాల అమలుపై ఈ నెల 21, 22 తేదీల్లో న్యూఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన అంతర్జాతీయ వర్క్ షాప్ విజయవంతంగా జరిగిందని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ భూ వనరులు, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ వర్క్ షాప్‌లో నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్, పట్టణ నివాసాల ఆధారిత భూమి సర్వే (ఎన్ఏకెఎస్‌హెచ్ఏ)లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎంపికైన కుప్పం, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, ఏలూరు, కాకినాడ, తిరుపతి, అనంతపురం మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లు, రాష్ట్ర డైరెక్టర్ సర్వే, సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీకేష్ బి.లత్కర్ పాల్గొన్నారన్నారు. వర్క్ షాప్‌లో వివిధ దేశాల, రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొని ఆయా ప్రాంతాల్లో పట్టణాల్లో జరుగుతున్న భూసర్వే, రీసర్వే విధానాలను కూలంకషంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారన్నారు. ముఖ్యంగా సర్వే విధానంలో అత్యాధునిక డ్రోన్‌లు, జిఐఎస్ సాంకేతికల వినియోగం ద్వారా, రికార్డ్స్ భద్రపరచడం వంటి అంశాలను ఉదాహరణలతో చర్చించడం జరిగిందన్నారు.

అంతర్జాతీయ వర్క్ షాప్ ముగింపు సభకు మంగళవారం ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ని మర్యాదపూర్వకంగా నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కలిశారు. వర్క్‌షాప్‌లో చర్చించిన అంశాలు, నూతన విధానాలను మంత్రి అడిగి తెలుసుకొని, రాష్ట్రంలో అమలు చేయాల్సిన విధానంపై చర్చించారు.



జాతీయ సదస్సులో పాల్గొన్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కమిషనర్ పులి శ్రీనివాసులు

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవాలయ వ్యవస్థ సమూల ప్రక్షాళనకై వచ్చే ఏడాది జనవరి 5 తేదీన విజయవాడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తలపెట్టిన హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని జిల్లా మందిర అర్చక పురోహిత ప్రముఖుడు పత్తిపాటి మాధవశర్మ తెలిపారు. బ్రాడీపేట వీహెచ్‌పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాలయ వ్యవస్థను రక్షించుకోవడానికి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు మురళీ, చిరుమామిళ్ల గోపి, పవన్ శర్మ, కోగంటి రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వీహెచ్‌పీ సభ్యులు

నేడు విద్యుత్‌సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా బుదవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉద్యోగనగర్, ఎస్‌వీఎన్ కాలనీ, నేతాజీనగర్, వైష్ణవినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డి 8 సెక్షన్ ఏఈ కె.అంజనీరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.



కాకతీయ కన్వెన్షన్ సొసైటీ సీనియర్ సిటిజన్స్ కంఫర్ట్ హోమ్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

పిల్లలకు కుటుంబ విలువలు నేర్పించాలి

- కాకతీయ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

తాడికొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమౌతున్న తరుణంలో ఇప్పుడు ఉన్న పిల్లలకు కుటుంబ విలువల గురించి పెద్దలు నేర్పించాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. తాడికొండ మండలం మోతడక గ్రామంలో కాకతీయ కన్వెన్షన్ సొసైటీ సీనియర్ సిటిజన్స్ కంఫర్ట్ హోమ్, ఫ్యామిలీ రిక్రియేషన్ సెంటర్ ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను మరువకుండా, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వీలైనంత వరకు ఇంగ్లీష్‌లో మాట్లాడకుండా మాతృభాషలో మాట్లాడాలన్నారు. ఎదుటి వారి కాళ్లకు దండం పెట్టే పద్ధతిని మార్చుకోవాలన్నారు. రెండు చేతులతో నమస్కారం పెట్టడం సంస్కారమన్నారు. విదేశీయులు భారతదేశం వైపు చూస్తుంటే ఇక్కడి వారు విదేశాలకు వెళ్లిపోతున్నారన్నారు. సొంత ఊరిని, ప్రజలను మర్చిపోరాదన్నారు. విదేశాలకు వెళ్లి నేర్చుకుని, సంపాదించి ఇక్కడకు వచ్చి సమాజం కోసం పాటుపడాలన్నారు. ఎంత సంపాదించినా చనిపోయిన తర్వాత ఏమీ తీసుకువెళ్లలేమనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించుకోవాలని హితవుపలికారు. ప్రకృతితో స్నేహం చేయాలన్నారు. తండ్రికి ఇచ్చిన మాట కోసం అడవికి వెళ్లిన రాముడు దేవుడు అయ్యారన్నారు. వృద్ధాశ్రమాలకు ఆ పేరు పెట్టవద్దని, పెద్దల ఆశ్రయమని పెట్టాలని సూచించారు. కాకతీయ కన్వెన్షన్‌కు సీనియర్ సిటిజన్ కంఫర్ట్ హోమ్ అని పెట్టడం సంతోషంగా ఉందన్నారు. విదేశాల్లో ఉన్న పిల్లలు తల్లిదండ్రులను మర్చిపోకుండా వారి బాగోగులు చూసుకోవాలన్నారు. కన్వెన్షన్ నిర్మాణానికి రూ.2 కోట్ల గ్రానైట్ అందజేసిన ప్రత్తిపాటి సురేష్‌ను, రూ.20 లక్షలు విలువైన ఫ్యాన్లు, లైట్లు అందజేసిన వసంత శ్రీనును సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, యరపతినేని శ్రీనివాసరావు, గళ్లా మాధవి, షేక్ నసీర్ అహ్మద్, భాష్యం ప్రవీణ్, నడుకుదిటి ఈశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్, కన్వెన్షన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ యర్రా నాగేశ్వరరావుతో పాటు మేకా యుగంధర్, భాష్యం రామకృష్ణ, కొత్తపల్లి రమేష్, గోరంట్ల పున్నయ్య, నన్నపనేని రాజకుమారి, డాక్టర్ జీ.వీ. నాయుడు, దామచర్ల శ్రీనివాసరావు, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

అమరావతి
శంకుస్థాపన ప్రదేశంలో పూజలు

పనులకు విఘ్నాలు కలగకూడదని మహిళల పూజలు



రాజధాని శంకుస్థాపన ప్రదేశంలో పూజలు చేస్తున్న రైతులు, మహిళలు

తుళ్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి శంకుస్థాపన జరిగి మంగళవారంతో తొమ్మిదేళ్లు అవుతుంది. ఈ సందర్భంగా ఉద్దండ్రాయునిపాలెంలో గతంలో మోదీ ఆధ్వర్యంలో జరిగిన శంకుస్థాపన ప్రదేశంలో మహిళలు, రైతులు పొంగళ్లు పెట్టి పూజలు చేశారు. త్వరలో అమరావతి 2.0 నిర్మాణ పనులు మొదలు పెడుతున్న సందర్భంగా ఎటువంటి విఘ్నాలు కలగకూడదని, రాబోయే రోజుల్లో అమరావతి అంగుళం కూడా కదలకుండా కూటమి ప్రభుత్వం భద్రత కల్పించాలని కోరుకున్నారు. భగవంతుని ఆశీస్సులు అమరావతికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఎల్లప్పుడు ఉండాలని పూజలు చేసినట్లు రైతులు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు. అమరావతి నిర్మాణంతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందడుగు వేస్తుందని రైతులు, మహిళలు ఆకాంక్షించారు.



చూసేందుకు చిరుత పులిలా ఉంటుంది. కానీ అంతపెద్దది కాదు. పిల్లిలా చిన్నది ఉంటుంది. కానీ పిల్లి కాదు. చిరుత పులి రూపం.. పిల్లి లక్షణాలు ఉన్న ఈ బావురుపిల్లి ఆనవాళ్లు ఉమ్మడి గుంటూరు జిల్లా కృష్ణా అభయారణ్య ప్రాంతంలోని తీర ప్రాంతంలో గుర్తించారు. ప్రపంచంలో అరుదైనదిగా.. అంతరించిపోతున్న వన్యప్రాణుల్లో బావురుపిల్లి కూడా ఒకటి. కానీ ఈ బావురుపిల్లి సంచారం గుర్తింపుతో కృష్ణా అభయారణ్యంలోని మడ అడవులు ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. దక్షిణ ఆగ్నేయ ఆసియా దేశాల్లో మాత్రమే కనిపించే అరుదైన జాతి ప్రపంచంలో 11 దేశాల్లో మాత్రమే ఈ బావురు పిల్లల ఉనికి ఉన్నట్లు సమాచారం.



వీడియోల్లో రికార్డు అయిన బావురుపిల్లి (ఫైల్‌ఫొటో)

తీరంలో.. బావురుపిల్లి

- ప్రపంచ వ్యాప్తంగా అంతరిస్తున్న వన్యప్రాణి
- కృష్ణా అభయారణ్యం మడ అడవుల్లో గుర్తింపు
- సుమారు వందకిపైగా ఉండొచ్చని 2015లోనే అంచనా
- అరుదైన ఫిషింగ్‌క్యాట్ వల్ల సముద్ర మత్స్య సంపద వృద్ధి



కెమెరాలను లంకెవానిదిబ్బ మడ అడవుల్లో అమరుస్తున్న రీసెర్చి బృందం (ఫైల్‌ఫొటో)

రేపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మనదేశంలో ఎక్కడా సంచారం లేని అరుదైన బావురు పిల్లుల సంచారం కృష్ణా అభయారణ్యంలోని బాపట్ల, కృష్ణా జిల్లాలోని మ్యాంగ్రోస్(మడ అడవులు) ఫారెస్ట్‌లో సంచరిస్తున్నట్లు రీసెర్చి అధికారులు గతంలో గుర్తించారు. కృష్ణా అభయారణ్యంలో అంతరించిపోతున్న మడ అడవులపై 2015 డిసెంబరులో పరిశోధనలు జరిగాయి. ఈ పరిశోధనల్లో బాపట్ల, కృష్ణా జిల్లాలోని సముద్ర తీరం వెంబడి లంకేవాని దిబ్బ మడ అడవుల్లో ఫిషింగ్‌క్యాట్ అడుగుల గుర్తులను గుర్తించారు. ఈస్ట్‌కోట్స్ వైల్డ్‌లైఫ్ ఇండియా, ఈస్ట్ అండ్ గార్డు వైల్డ్‌లైఫ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన అశ్విన్‌నాయుడు, కైల్ థామస్, మూర్తి కాంతి మహంతిల నేతృత్వంలో జరిగిన పరిశోధనలో ఫిషింగ్ క్యాట్ జంతువు సంచరిస్తున్నట్లు గుర్తించారు. బాపట్ల జిల్లాలోని లంకెవానిదిబ్బ, కొత్తపాలెం, మోళ్ళగుంట, కృష్ణా జిల్లాలోని సొర్లగొంది, పాలకాయ తిప్ప, గుళ్ళలమోద, నాచుగుంట్ల, యేలిచెట్ల దిబ్బల్లోని మడ అడవుల్లో బావురు పిల్లులు నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. దీంతో జాతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సమాచార టెక్నాలజీ(హైదరాబాద్) ఫిషింగ్ క్యాట్ కన్జర్వేషన్ యూఎస్‌ఏ, ఈస్ట్ అండ్ గార్డ్(ఇండియా) ఆంధ్రప్రదేశ్ అటవీ సంరక్షణశాఖ ఆధ్వర్యంలో 2015 డిసెంబరులో పరిశోధన ప్రారంభించారు. 2016 జనవరిలో ఆయా జంతువుల వివరాలను తెలుసుకునేందుకు వందకు పైగా కెమెరాలను తీరప్రాంతంలో అమర్చారు. ఈ క్రమంలో కొద్ది రోజుల తర్వాత వీడియో క్లిప్పింగ్‌లను పరిశీలించగా నక్కలు, నీటి కుక్కలతో పాటు బావురు పిల్లులను గుర్తించారు. కెమెరాలలో 20కిపైగా బావురు పిల్లులు చిక్కాయి. అయితే ఈ ప్రాంతంలో సుమారు వందకు పైగా ఉండవచ్చని అప్పట్లో అంచనా వేశారు.



గతంలో లంకేవానిదిబ్బ మడ అడవుల్లో బావురపిల్లుల అడుగులు

రకరకాల పేర్లు

ర్హైనెలూరుస్ వైవెర్రి నస్ అనే శాస్త్రీయ నామంతో బావురు పిల్లిని పిలుస్తారు. దీనిని పులి బావుర, మరక పిల్లి, నీటి పిల్లి, ఫిషింగ్ క్యాట్ అని కూడా అంటారు. అంతరించిపోతున్న ఈ జంతువును అంతర్జాతీయ యూనియన్ నేచర్ అనే సంస్థ షెడ్యూల్-1లో పొందుపరిచింది.

ప్రపంచంలో 2 వేలే..

చేపలను వేటాడి జీవించే ఈ జాతి పిల్లులు ప్రపంచవ్యాప్తంగా 11 దేశాల్లో మాత్రమే కనిపిస్తాయి. వీటి మొత్తం సంఖ్య 2 వేలలోపే. 78 సెం.మీ. పొడవు, 8.8 కిలోల వరకూ బరువు ఉండే ఈ బావురు పిల్లి అచ్చం చిరుత పులిని పోలి ఉంటుంది. రాత్రి వేళల్లో మాత్రమే చేపలను వేటాడి జీవిస్తుంది. మన ఇండ్లలో తిరిగే పిల్లుల కంటే పెద్దగా చిరుత పులికంటే చిన్నగా ఉంటుంది. ఇది చేపల వేటకు వెళ్లే సమయంలో ఆ పరిసరాల్లో మల, మూత్ర విసర్జన చేస్తుంది. ఈ వాసన గమనించిన ఇతర జంతువులు ఆ పరిసరాలకు రావు.

బావురు పిల్లుల ప్రయోజనాలు

పులి రూపంలో ఉండే బావురపిల్లి సంచారం వల్ల ఆ ప్రాంతంలో మత్స్యసంపద అభివృద్ధి చెందుతుంది. పర్యావరణ పరిరక్షణకు కూడా దోహద పడుతుంది. సముద్రంలో ఉండే పలురకాల చేపలు పెట్టే గుడ్లను కొన్ని రకాల చేపలు తినేస్తాయి. ఇలాంటి చేపల కారణంగా మత్స్యసంపద వృద్ధి దెబ్బతింటుంది. అలాంటి చేపలను బావురపిల్లి తింటుంది. దీని వల్ల మత్స్య సంపద వృద్ధి చెందుతుంది. మానవుల మనుగడకు బావురపల్లి వల్ల ఎలాంటి హాని ఉండదని రీసెర్చి అధికారులు అంటున్నారు. వేటగాళ్ల బారి నుంచి వీటిని రక్షించేందుకు తీరప్రాంత గ్రామాల్లో అటవీ వన్యప్రాణిశాఖతో పాటు వివిధ సంస్థలు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

ధ్యానబుద్ధను సందర్శించిన కశ్మీర్ యువత



అమరావతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని ధ్యానబుద్ధ ప్రాజెక్టును కశ్మీర్ యువతీ, యువకులు మంగళవారం సందర్శించారు. భారత ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ, గుంటూరు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయంలో కశ్మీర్ యూత్ ఎక్సేంజ్ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి హాజరైన కశ్మీరు యువతీయువకులు 132 మంది ధ్యానబుద్ధను సందర్శించారు. కశ్మీర్‌లోని పుల్వామా, బుడ్గామ్, శ్రీనగర్, కుప్వారా, బారాముల్లా, అనంతనాగ్ జిల్లాల నుంచి యువతీయువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పురావస్తు ప్రదర్శనశాల, సచివాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం గుంటూరు, వైజాగ్ జిల్లా అధికారులు కిరణ్మయి, మహేశ్వరరావు, సురేష్‌గుప్తా, అనిల్‌కుమార్, అన్సారీ, సయ్యద్ తహీర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీలతో సమావేశమైన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

రౌడీషీటర్లను ఉపేక్షించొద్దు

- శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మహిళలపై అఘాయిత్యాల కట్టడికి కఠినంగా వ్యవహరించాలి
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోండి
- రేంజ్‌లోని ఎస్పీలకు ఐజీ త్రిపాఠి దిశానిర్దేశం

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రేంజి పరిధిలో రౌడీషీటర్లను ఉపేక్షించొద్దని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఎస్పీలను ఆదేశించారు. గుంటూరులోని ఐజీ కార్యాయంలో మంగళవారం ఆయన ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రౌడీషీటర్ల కార్యకలాపాలను అణిచివేయడం, వారిపై నిఘా, సీసీ కెమెరాల పనితీరు, కేసు దర్యాప్తుల్లో ఆధునిక పరిజ్ఞానం వినియోగం, ఫ్రెండ్లీ పోలీసింగ్ తదితరాలకు సంబంధించి ఎస్పీలకు ఐజీ పలు సూచనలు చేశారు. సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు చేసే వారిని కట్టడి చేయాల న్నారు. సైబర్ క్రైమ్‌లను తగ్గించాలన్నారు. ఇటీవల తెనాలిలో జరిగిన ఘటనలో బాధితురాలిపై రౌడీషీటర్ అత్యాచారం చేసి చంపేశాడని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరిగిందన్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్‌లో కూడా తప్పుడు ప్రచారం జరుగుతోందని అటువంటి వాటిని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవా లన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎస్పీలు సతీష్‌కుమార్, శ్రీనివాసరావు, తుషార్‌డూడీ, దామోదర్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న డ్రోన్ సమ్మిట్



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు







- అట్టహాసంగా మంగళగిరిలో ప్రారంభోత్సవం
- సీకే కన్వెన్షన్‌లో జాతీయ సంస్థల స్టాల్స్ ప్రదర్శన
- డ్రోన్స్ తయారీ, పరిశోధన, శిక్షణ, వినియోగంపై అవగాహన

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని దేశంలోని డ్రోన్ రాజధానిగా తీర్చిదిద్దాలన్న సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యానికి అనుగుణంగా డ్రోన్ సమ్మిట్‌లో స్టాల్స్ ప్రదర్శన జరిగింది. మంగళవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన అమరావతి డ్రోన్ సమ్మిట్ - 2024 ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం సీఎం చంద్రబాబు అమరావతి డ్రోన్ ఎగ్జిబిటర్స్ స్టాల్స్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర రహదారులు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సౌకర్యాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎగ్జిబిటర్స్ స్టాల్స్‌లో పలు రంగాలకు వినియోగించే డ్రోన్లను సీఎం పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని రంగాల్లోనూ సులభంగా వినియోగించుకునేలా డ్రోన్లను రూపొందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి డ్రోన్స్ తయారీ, పరిశోధన, శిక్షణ, సంస్థలు సమ్మిట్‌లో స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. ప్రస్తుతం అనేక రంగాలలో డ్రోన్ సేవలను విస్తరించిన విధానాన్ని వాటికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరికరాలు అందించే కంపెనీలు, పరిశోధన చేసే సంస్థలు వాటి ఉత్పత్తులను ప్రదర్శించారు. వ్యవసాయ అవసరాలైన పురుగుమందుల పిచికారి, శాంతి భద్రతలకు సంబంధించిన క్రౌడ్ సర్వేలెన్స్, సర్వే, మ్యాపింగ్, ఖనిజాల అన్వేషణ, విపత్కర పరిస్థితిలో అత్యవసర మందులు, సరుకులు రవాణాకు వినియోగించే అనేక రకాల డ్రోన్లను ప్రదర్శనలో ఉంచారు. వీటితోపాటు డ్రోన్ల స్ట్రక్చర్ డిజైనింగ్, మోటర్లు, మదర్‌బోర్డులు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకారణాలు, బ్యాటరీలు తయారు చేసే కంపెనీలు పరిశోధనా సంస్థలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. వాణిజ్య కంపెనీలే కాకుండా ఐఐటీ తిరుపతి, ఐఐటీ కాన్పూర్, హైదరాబాద్‌తో పాటు, పలు ప్రైవేట్ యూనివర్సిటీల్లో పరిశోధన విభాగాలు రూపొందించిన డ్రోన్లు, సైన్యం అవసరాల కోసం అవసరమైన డ్రోన్లను ప్రదర్శనలో ఉంచారు. వ్యవసాయ అవసరాల కోసం ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ తయారు చేసిన డ్రోన్లు, డ్రోన్ పైలెట్ శిక్షణపై అవగాహన కల్పిస్తూ స్టాల్ ఏర్పాటు చేసింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధతో అనుసందానం చేసి పరిశోధన చేసి అభివృద్ధి పరిచిన డ్రోన్లు వరదలు తుఫాన్లు వంటి విపత్కర పరిస్థితిలో నష్టాన్ని రియల్ టైంలో అంచనా వేసేందుకు, సూదూర ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న లోపాలను గుర్తించేందుకు, 10 కేజీల నుంచి 100 కేజీల వరకు సరుకులను 300 కిలోమీటర్ల వరకు రవాణా చేసే బ్యాటరీ, పెట్రోల్, హైడ్రోజన్‌తో నడిచే డ్రోన్లు ప్రదర్శనలో ఉన్నాయి. ఎగ్జిబిటర్స్ స్టాల్స్‌ను పెద్ద ఎత్తున విద్యార్థులు, ఔత్సాహికులు , వివిధ రంగాల్లోని నిష్ణాతులు, ప్రజలు తిలకించి డ్రోన్లకు సంబంధించి అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సెక్రెటరి వుమలున్మాంగ్ వూయలనం, రాష్ట్ర పెట్టుబడులు మౌలిక సౌకర్యాల శాఖ సెక్రెటరి ఎస్ సురేష్ కుమార్, డ్రోన్ కార్పొరేషన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కే దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిర్రావూరు, ప్రాతూరు, తాడేపల్లి ఆశ్రమం, ప్రాంతాల్లో నూతన విద్యుత్‌లైన్ల నిర్మాణ పనుల నిమిత్తం బుధవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ సురేష్‌బాబు తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు చిర్రావూరులో అంతరాయం ఉంటుందని చెప్పారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

తాడేపల్లిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి లక్షా 79 వేల 74 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 40 గేట్లను 4 అడుగులు, 30 గేట్లను 3 అడుగుల మేర ఎత్తి దిగువకు లక్షా 69 వేల 250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువలకు 6 వేల 318 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 3వేల 506 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు. దిగువ నదీతీర ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి : డీటీ ప్రణీత

కాకుమాను, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ తహసీల్దార్ ప్రణీత అన్నారు. మండలపరిధిలోని బోడిపాలెంలో మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీలను డీటీ స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రియదర్శిని, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో డానియేల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెన్నుపాటి రామకృష్ణ, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

డీపీ అగ్రహారంలో ఏడు అర్జీలు

దుగ్గిరాల, అక్టోబరు 22: మండలంలోని దేవరపల్లి అగ్రహారంలో జరిగిన భూరీ-సర్వేలో రైతులు ఎదుర్కొన్న సమస్యలపై గ్రామ సభను మంగళవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దుగ్గిరాల, చింతలపూడి, శృంగారపురం, మోరంపూడి, తుమ్మపూడి, కంఠంరాజుకొండూరు తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఐ సునీత తెలిపారు. డీపీ అగ్రహారంలో జరిగిన గ్రామసభలో రైతుల నుండి ఏడు అర్జీలు వచ్చినట్లు సునీత తెలిపారు. అనంతరం గ్రామంలో మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేశారు. సర్వేయర్ గోపాలరావు, ఆర్ఐ త్రివేణి, వీఆర్‌వోలు జయకాంత్, అనిల్‌వర్మ, విలేజ్ సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

11 దరఖాస్తులు

పెదనందిపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రాజుపాలెంలో భూసమస్యల పరిష్కారం కోసం మంగళవారం గ్రామసభ నిర్వహించారు. రీ సర్వేలో జరిగిన పొరపాట్ల గురించి 11 మంది దరఖాస్తు చేసుకున్నట్లు డీటీ కరీముల్లా తెలిపారు. 8 రీసర్వే జరపాలని, 3 దరఖాస్తులు గ్రామ సమస్యలపై వచ్చినట్లు ఆయన తెలిపారు. పరిష్కారం కోసం పని చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంగళగిరి సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం చినకాకాని ఎన్నారై జంక్షన్ వద్ద ఫ్లైఓవర్‌పై ఈ నెల 20వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనదారుడ్ని కారు ఢీకొనడంతో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు మృతదేహాన్ని మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. అయితే, మృతుడి ఆచూకీ తెలియరాలేదని, గుర్తించిన వారు రూరల్ ఎస్ఐ నంబర్ 8688831363కు ఫోను చేసి సంప్రదించాలని కోరారు.



● వట్టిచెరుకూరు మండలంలోని ముట్లూరులో బుధవారం ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనపై సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఏఈ రవితేజ వెల్లడించారు.

ఆధార్ క్యాంపు ప్రారంభం

పిరంగిపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని మార్నింగ్ స్టార్ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎంపీడీవో వెంకటేశ్వర్లు క్యాంపును ప్రారంభించారు. ఈ కేంద్రంలో పాఠశాలలో చదివే విద్యార్థులు, కళాశాల విద్యార్థినిలు, మండలంలోని ప్రజలు ఈనెల 25వ తేదీ వరకు జరిగే ఈ క్యాంపులో పాల్గొని తమ ఆధార్ పత్రాలను అప్‌డేట్ చేయించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తదితర మండల అధికారులు, సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీడని వర్షం.. అన్నదాతల్లో ఆందోళన

- ఈ ఏడాదీ కర్షకుడికి తప్పని కష్టాలు
- కుళ్లిపోతున్న పత్తికాయలు, రాలుతున్న పూత పిందె
- ఉరకెత్తుతున్న మిర్చి, పొగాకు పంటలు
- నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న రైతులు


వర్షపు నీరు నిలిచి ఉరకెత్తిన పొగాకు


మిర్చి పైరులో నిలిచిన వర్షపు నీరు

పెదనందిపాడు, అక్టోబరు, 22 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాదీ అధిక వర్షాలతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఎన్నడూ లేని విధంగా అక్టోబరులో అల్పపీడన ప్రభావం, రుతుపవనాలు రాకతో అధిక వర్షాలు కురవడంతో కష్టాల సాగుతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. గత పది రోజులుగా ఉష్ణోగ్రతలు కొద్ది సమయం పెరగడం, ఒక్కసారిగా జల్లులు పడడం, రాత్రివేళల్లో అధిక వర్షాలు పడటం రైతులు సాగుపై నిరాశే మిగులుతుంది. పత్తిలో ఇప్పటికే పూత, కాయదశలో ఉంది. గతంలో పత్తి పంటకు గులాబి రంగుపురుగు ఆశించి తీవ్ర నష్టాలను చవిచూసిన రైతులు గతేడాది నుంచి గులాబీరంగు పురుగు ఉధృతి లేకపోవడంతో రైతులు అధిక శాతం పత్తిపంట సాగు చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాలువలు పూడికతీయకపోవడంతో నీరు పారుదల లేక పొలాల్లో నీరు నిలిచి కాయ కుళ్లిపోవడంతో పాటు పూత రాలిపోతుందని, పంట చేతికొచ్చే సమయంలో వర్షార్పణం అవుతుందని రైతులు వాపోతున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితులు డిసెంబరులో కురిసిన వర్షాలకు, చీడ పీడల వల్ల పూర్తిగా దెబ్బతిని ఆశించిన మేరకు దిగుబడులు రాకపోవడంతో కొంతమంది రైతులు పంటలను వీకేసి అపరాల పంటలను సాగు చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రబీకి సిద్ధమయ్యేందుకు పొగాకు, మిరప విత్తనాలతో స్వయంగా నారుమళ్లు పోసుకొని సిద్ధం చేస్తున్నారు. భారీ వర్షాల వల్ల నారుమళ్లలో నీరు నిలిచి పైర్లు పూర్తిగా కుళ్లిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా నష్టాలతో కొట్టుమిట్టాడుతున్న రైతులు ఈసారైనా గట్టెక్కుతామనుకున్న తరుణంలో మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా ఈ ఏడాది అధిక వర్షాలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు.


కుళ్లిపోయి నల్లగా మారిన పత్తికాయ

నాటిన పొగాకు పైరు కుళ్లిపోతుంది

● రైతు గడ్డం హరికిషోర్



గతేడాది పొగాకు పైరుకు వాతావరణం అనుకూలించడంతో ఆశించిన మేర పంట దిగుబడి రావడంతో ఈ ఏడాది ముందుగానే నాకున్న 10 ఎకరాలతో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకొని 6ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాటిన మొక్కలు వర్షపు నీటిలోనే ఉండటంతో కుళ్లిపోయాయి. దీంతో తమకు ఈ ఏడాది కూడా నష్టాలు చవిచూడాల్సిందేనంటూ ఆందోళన చెందుతున్నాం.

ముస్లింల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం

● సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి సవిత


మెల్లెంపూడిలో మంత్రి సవిత

తాడేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర బీసీ ఇడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్ సవిత అన్నారు. తాడేపల్లి మండలం మెల్లెంపూడిలో సోమవారం రాత్రి జరిగిన గ్యార్మీ ఉత్సవంలో మంత్రి సవిత పాల్గొని ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి మొదటి నుంచి చంద్రబాబునాయుడు టీడీపీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. 2014-19లో ముస్లింల అభ్యున్నతికి అమలు చేసిన పథకాలన్నింటిని మరోసారి అమలు చేయనున్నట్టు మంత్రి తెలిపారు. ఆనాడు దుల్హన్ పథకం, రంజాన్ తోఫా, విదేశీ విద్య, రాయితీ రుణాలు గ్రాంట్ ఇన్ ఎయిడ్ వంటి ఎన్నో పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేశారన్నారు. ఇమాంలు, మౌజమ్‌లకు మొదటిసారిగా ఆర్థిక సాయం అందించిన ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమన్నారు. ఆ తరువాత జగన్ తమ ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నింటిని నిలిపివేసి ముస్లిం ద్రోహిగా ముద్రపడ్డారన్నారు. 2014-19లో టిడిపి ప్రభుత్వం 40వేల జంటలకు దుల్హన్ పథకం అందజేస్తే.. జగన్ ప్రభుత్వం తన ఐదేళ్లలో కేవలం ఆరు వేలమందికి మాత్రమే షాదీ తోఫా పతకం పేరుతో ఆర్థిక సాయం అందించారన్నారు. ముస్లింలకు మేలు కలిగేలా వక్ఫ్ భూముల సర్వే పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. ఉర్దూ భాష అభివృద్ధికి మదర్సాల నిర్వహణకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. తొలుత మంత్రికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, మెల్లెంపూడి అధ్యక్షుడు షేక్ నాగుల్, కొమ్మారెడ్డి కిరణ్, కళ్లం రాజశేఖర్‌రెడ్డి, బొమ్మారెడ్డి కోటిరెడ్డి, శొంఠి రామ్మోహనరావు, షేక్ ఖాసింబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు

తాడేపల్లిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లికి చెందిన టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ నాలుగు సంవత్సరాల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో తాడేపల్లి మణిపాల్ వైద్యశాలలో ఈ నెల 16న కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా దానబోయిన కుటుంబసభ్యులు మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయంతో సుందరరావుయాదవ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ సక్సెస్ అయి చికిత్స పొందుతున్నారన్నారు. ఆపరేషన్‌కు సహాయ సహకారాలు అందించిన రాష్ట్ర మంత్రివర్యులు లోకేశ్‌కు దానబోయిన కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

లక్షల యూనిట్ కాస్ట్‌తో నిర్మించిన గృహ నిర్మాణాలు భేష్

● కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గవా ప్రసాద్ ● వరగానిలో పర్యటించిన బృందం


లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రూ. 2 లక్షల యూనిట్ కాస్ట్‌తో నిర్మించిన గృహ నిర్మాణాలు చక్కగా ఉన్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ డిప్యూటీ డైరెక్టర్ గవా ప్రసాద్ తెలిపారు. మంగళవారం పెదనందిపాడు మండలం వరగాని గ్రామంలో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన గ్రామీణ పథకం కింద నిర్మించిన గృహాలను ఆయన కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి శైలేష్ కుమార్ సింగ్, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పీ రాజబాబు, చీఫ్ ఇంజనీర్ జీవీ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిస్సా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ప్రతినిధులు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలసి పరిశీలించారు. ముందుగా పీఎంఏవై-జీ 2021-22 కింద ఇల్లు నిర్మించుకున్న వ్యవసాయ కార్మికులు కొరివి సుమన్, ఆరుమల్లా మరియమ్మ గృహాలను పరిశీలించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అలాగే కట్టా నాగేశ్వరరావు ఇంటిని 2017-18లో, కట్టా నాగరాజు నిర్మించుకుంటున్న ఇంటిని పరిశీలించి ఆయన తల్లిమాణిక్యమ్మతో మాట్లాడారు. నాలుగు సంవత్సరాల క్రితం పీఎంఏవై- జీ పథకం కింద ఇల్లు మంజూరైందని, బిల్లు రానందున ఇంటి నిర్మాణం పూర్తి కాలేదని ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ డిప్యూటీ డైరెక్టర్ గవా ప్రసాద్‌కు మాణిక్యమ్మ తెలిపారు. వరగానీలో నిర్మించిన ఇళ్లను పరిశీలించి బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీకే ఇంటి నిర్మాణానికి రుణం అందిస్తుందని తెలిపారు. పేద వారికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇల్లు నిర్మిస్తుందన్నారు. సభలో హౌసింగ్ అధికారులు మాట్లాడుతూ వరగానిలో 2016-17 సంవత్సరంలో పీఎంఏవై-జీ కింద 38 ఇళ్లు, 2017-18లో ఒకటి, 2021-22లో 22 ఇళ్లు కలిపి మొత్తం 61 ఇళ్లను మంజూరు చేసిందని, ఇందులో 17 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయని అన్నారు. ఇళ్ల నిర్మాణాలు ఎందుకు పూర్తి కాలేదని కేంద్ర గ్రామీణా భివృద్ధి మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గవా ప్రసాద్ లబ్ధిదారులను ప్రశ్నించగా, పంట నష్టం జరిగి ఆర్థిక ఇబ్బందులు రావడం వల్ల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేకపోయామని లబ్ధిదారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణాభి వృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ చాహద్, ఎస్ఈ జయరాం చారి, హౌసింగ్ పీడీ జేవీఎస్ఆర్‌కేవీ ప్రసాద్, ఈఈ శంకరరావు, తెలంగాణ హౌసింగ్ ఎస్ఈ చైతన్యకుమార్, ఐదు రాష్ట్రాల ప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు,

మంగళగిరి, అక్టోబరు 22: రైతులు వీలైనంత వరకు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మంగళగిరి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మకూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయపై దృష్టి సారించి వ్యవసాయ ఖర్చులు తగ్గించుకుని ఆరోగ్యకర మైన పంటలు పండించాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు తాటి వెంకట్రావు, కొమ్మా సుకుమార్, లవకుమార్, సాంబశివరావు, వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ నిపుణులు, రైతులు పాల్గొన్నారు.

● తాడేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వీరిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ వద్ద మంగళవారం అగ్రికల్చర్ అధికారులు, టీడీపీ, జనసేన నాయకులు రైతులకు వరి, మినుముల నాట్లలో ఎలుకల నివారణకు ఎలుకల మందును పంపిణీ చేశారు.

● దుగ్గిరాల, అక్టోబరు 22: మండలంలోని గొడవర్రు, పెదకొండూరు గ్రామాల్లో ఏవో పి.శిరీష, వ్యవసాయ సహాయాధికారులతో కలిసి ఎలుకల నివారణకు వినియోగించే, విషపు ఎరను స్వయంగా రైతులతో తయారు చేయించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, రమేష్, పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

● కాకుమాను, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని 11 గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. కాకుమానులో ఉప సర్పంచ్ బోడపాటి ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లమోతు పూర్ణచంద్రరావు స్థానిక రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

● వట్టిచెరుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరులోని లైబ్రరీ సెంటర్లో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కోసం నిర్దేశించిన మందును పంపిణీ చేశారు.

ఆలీనగర్‌లో ఇంటింటి సర్వే చేసిన జిల్లా అధికారులు

దుగ్గిరాల, అక్టోబరు 22: దుగ్గిరాల ఆలీనగర్‌లో ఇంటింటి సర్వేను మంగళవారం నిర్వహించారు. దుగ్గిరాలలో అంతర్భాగంగా వున్న ఆలీనగర్‌లో కొంత భాగం గ్రామానికి ఐదుకిలోమీటర్ల దూరంలో ఉన్న కొలకలూరు గ్రామ పంచాయతీ పరిధిలో దశాబ్దాలకాలంగా కొనసాగుతున్న విషయం విదితమే. కాగా 2015లో అత్యంత సమీపంలోనున్న దుగ్గిరాలలో విలీనం చేసేందుకు అప్పట్లో అధికారికంగా ఆదేశాలతో పాటు సన్నాహాలు జరిగాయి. పంచాయతీ కార్యాలయానికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్న నేపథ్యంలో డీపీఎల్‌ఓ స్వరూపరాణి నేతృత్వంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆలీనగర్‌లో నివాసముంటున్న వారి వివరాలను సేకరించారు.

రైతుల ప్లాట్లకు ఈ - లాటరీ

● 23, 24 తేదీల్లో మధ్యాహ్నం నుంచి కేటాయింపు

తుళ్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రాజధాని అమరావతి కోసం భూ సమీకరణ పథకంలో భాగంగా భూములను ఏపీ సీఆర్డీఏకి అప్పగించి ఇంకనూ ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందాల్సిన రైతులకు కేటాయించిన నివాస, వాణిజ్య ప్లాట్లకు ఈ నెల 23, 24 తేదీల్లో అనగా బుధ, గురువారాల్లో ఈ-లాటరీ జరుగుతుందని సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటనలో మంగళవారం తెలిపింది. అమరావతిలో సుమారు 20 గ్రామాల్లో రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయిస్తారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ-లాటరీ జరుగుతుందని కార్యాలయ అధికారులు తెలిపారు. 20 గ్రామాలకు సంబంధించి 129 మంది రైతులకు గానూ 319 ప్లాటకు లాటరీ జరుగుతుందని తెలిపారు. 23వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు కురగల్లు, అబ్బరాజుపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, మల్కాపురం, ఉద్దండ్రాయునిపాలెం. 3 గంటల నుంచి 4 గంటల వరకు శాఖమూరు, తుళ్లూరు, మందడం లాటరీ ప్రక్రియ జరుగుతుంది. 24వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నవులూరు, నిడమర్రు, 4 గంటల నుంచి 5 వరకు బోరుపాలెం, రాయపూడి, నెక్కల్లు నేలపాడు, వెలగపూడి, వెంకటపాలెం, అనంతవరం గ్రామాల రైతులకు లాటరీ పద్ధతిలో ప్లాట్లను కేటాయిస్తారని తెలిపారు.

క్రీడలతో శారీరక, మానసిక పరిణితి


విద్యార్థులకు క్రీడల వస్తువులను పంపిణీ చేస్తున్న బండి అశోక్‌రెడ్డి, సుధారాణి

వట్టిచెరుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శారీరక, మానసిక పరిణితి పొందటానికి క్రీడలు ఎంతగానో దోహదపడ తాయని బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండి అశోక్‌రెడ్డి, సుధారాణి దంపతులు అన్నారు. మండలంలోని లేమల్లెపాడు గ్రామంలో గల ఎంపీపీ స్కూల్లో విద్యార్థులకు బండి సాహితీరెడ్డి జ్ఞాపకార్థం రూ.50వేలు విలువైన వివిధ రకాల క్రీడా సామగ్రి, గ్రామస్థుల సౌకర్యార్థం బల్లలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, ఎంఎస్‌సీ చైర్మన్ ఎస్తేర్‌రాణి, ఉప సర్పంచ్ సత్యనారాయణ, గ్రామపెద్దలు పాతూరి కృష్ణారావు, కే బుల్లిబాబు, కాకుమాను కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

732 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 732 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 11,000, గరిష్ఠ ధర రూ. 12,000, మోడల్‌ధర రూ. 11,700 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.11,000, గరిష్ఠధర రూ.11,700, మోడల్‌ధర రూ. 11,530 పలికాయి.

మెప్మా ద్వారా మహిళల జీవితాల్లో వెలుగు


నిగర్ సుల్తానాను అభినందిస్తున్న మెప్మా మిషన్ డైరెక్టర్ భరత్


తాడేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మెప్మా ద్వారా మహిళల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మిషన్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి ఎస్ తేజ్ భరత్ అన్నారు. మంగళవారం తాడేపల్లి బైపాస్ రోడ్డులో మెప్మా కార్యాలయానికి విచ్చేసిన తెనాలికి చెందిన ఎస్‌హెచ్‌జి సభ్యురాలు సయ్యద్ నహారే నిగర్ సుల్తానా, గ్రూప్ సభ్యులను అభినందించారు. ఇటీవల అఖిలభారత్ సరస్ ఎగ్జిబిషన్‌లో విజయనగరంలో ఏపి నుండి మెప్మా ద్వారా 28 స్టాల్స్‌లో 47 స్వయం సహాయక సభ్యులు వారు తయారు చేసిన ఉత్పత్తులతో అన్ని జిల్లాల నుంచి వచ్చి ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారు. పది రోజులకు గాను మెప్మా స్వయం సహాయక సంఘ సభ్యులు ఉత్పత్తులు రూ.47,73,857ల అమ్మకాలు జరిగి తద్వారా రూ.9,14,771లు లాభం వచ్చింది. ఈ మొత్తం లాభంలో తెనాలికి చెందిన నిగర్ సుల్తానా, సుభానల్లా, ఎస్‌హెచ్‌జి సంఘ సభ్యురాలు తయారు చేసిన క్రిస్టల్ బ్యాగ్ ఆర్టిఫీషియల్ జ్యుయలరీ ఉత్పత్తుల ద్వారా రూ.2,67,000లు అమ్మకాలు చేసి ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న ఎస్‌హెచ్‌జీలే అందరి కన్నా అధికంగా అమ్మకం చేశారు. దీంతో తేజ్ భరత్ మాట్లాడుతూ వారి గ్రూప్ ఒక యూనిట్ పెట్టుకునేలా ఏర్పాట్లు చేస్తామని అభినందించారు.

మలినేని సీఎస్ఈ విద్యార్థులకు బహుమతులు


బహుమతులను గెలుచుకున్న విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్ళు, డాక్టర్ అప్పారావు తదితరులు

వట్టిచెరుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మలినేని లక్ష్మయ్య కళాశాలలో సీఎస్ఈ మూడో సంవత్సరం విద్యార్థులు వీవీఐటీ కళాశాలలో జరుగుతున్న ఇన్నోవేషన్ టూ ఇన్నోవేషన్‌లో 2024 కార్యక్రమంలో పాల్గొని బహుమతులు సాధించారు. టీ శ్రీలక్ష్మి, కౌసల్య, బీ సుజాత, కే పల్లవిలు ప్రథమ బహుమతులు, పీ హేమా సహస్ర, పీ మాల్య, పీ వర్షిత, పీ భావనలు తృతీయ బహుమతులు సాధించారు. కాగా ప్రొటోవిజన్‌లో ఎస్ మేఘన తృతీయ బహుమతిని కైవసం చేసుకుంది. విద్యార్థులు బహుమతులు సాధించటంపై కళాశాల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు, డాక్టర్ జే అప్పారావు, సీఎస్ ఈ హెడ్ జీ రామస్వామి, ప్రొఫెసర్ కిషోర్‌బాబు, ఇతర విభాగాధిపతులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

షూటింగ్ బాల్ క్రీడలో విజేతలకు అభినందనలు


షూటింగ్ బాల్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తుళ్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): షూటింగ్ బాల్ క్రీడలో ప్రతిభ కనబరచి తాడికొండ వెల్లంకి వెంకటప్పయ్య స్కూల్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ నెల 19 నుంచి 21 వరకు అనంతపురం జిల్లా నార్పలలో జరిగిన షూటింగ్ బాల్ స్టేట్ లెవెల్ ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఆ పోటీలకు జిల్లా టీమ్‌లో వీవీఎస్ విద్యార్థులు రాంప్రకాశ్, ఏడుకొండలు, ఫయాజ్ ఎంపికయ్యారు. జరిగిన పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఆటలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, స్కూల్ చైర్మన్ మర్కాపూడి రవి, మంగళవారం ఘనంగా సన్మానించారు. క్రీడాకారులకు శిక్షణనిచ్చిన శ్రీనివాస్‌ని ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో జరగబోయే ఇంటర్ స్టేట్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ టీమ్ తరుపున రాంప్రకాష్,ఫయాజ్‌లు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాముడు సుంకర శ్రీనివాస్ ఈ సందర్భంగా తెలియజేశారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు: తహసీల్దార్

పొన్నూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జియావుల్‌హక్ అన్నారు. మంగళవారం దండమూడిలో ఆంధ్రప్రదేవ్ రీసర్వే ప్రాజెక్టుపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూ యజమానుల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామ సభలో వచ్చిన అర్జీలను త్వరలో పరిష్కరించునున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ గ్రామ సభలో రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలి క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైలు నుండి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు తెనాలి జీఆర్‌పి ఎస్‌ఐ జి.వెంకటాద్రి మంగళవారం తెలిపారు. తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలో మోరంపూడి లెవల్ క్రాసింగ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు అందిన సమాచారంతో సంఘటనా స్థలంలో పరిశీలించగా 30-35 వయసు కలిగిన యువకుడు రైలు నుండి జారి పడి మృతి చెందినట్లు గుర్తించడం జరిగిందన్నారు. మృతుని వద్ద గౌహిటీ-కోయంబత్తూరు సూపర్ ఫాస్ట్ టిక్కెట్ కలిగి ఉన్నాడు. మృతుడు గౌహితి-కొయ్యంబత్తూరు సూపర్‌ఫాస్ట్ రైలు నుండి జారి పడి ఉండవచ్చునని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు.



లాభాల్లోకి తెనాలి డిపో

● ఆర్టీసీ డీఎం రాజశేఖర్



తెనాలి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, ప్రయాణికుల సమన్వయంతో సంస్థను నడుపుతున్నామని డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ పేర్కొన్నారు. ఆయనతో మంగళవారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో పలు అంశాలపై ఫటాఫట్.

డిపోను లాభాల బాటలోకి తేగలరా?

డీఎం: గత ఆర్థిక సంవత్సరంలో రూ.2 కోట్ల నష్టాల్లో ఉన్న తెనాలి డిపోను గత నాలుగు నెలలో రూ.10 లక్షల లాభంలోకి తేగలిగాం.

డిపోలో బస్సుల పరిస్థితి ఎలా ఉంది ?

డీఎం: డిపోలో 87 బస్సులతో 125 సర్వీసులు నడుపుతూ 142 గ్రామాలకు సేవలు అందిస్తున్నాం. ఇటీవల 20కొత్త బస్సులు సమకూర్చుకున్నాం. మరో 10 కొత్త బస్సుల కోసం ప్రతిపాదనలు పంపాం.

ఆర్టీసీ స్థలాలను సద్వినియోగం చేస్తున్నారా?

డీఎం: ఆర్టీసీ బస్‌స్టేషన్, డిపో ప్రాంగణం మొత్తం 12 ఎకరాల్లో ఉంది. చుట్టు ఉన్న స్థలాల్లోని కమర్షియల్ కాంప్లెక్స్‌లతో ఏటా రూ.90లక్షల ఆదాయం వస్తోంది. కార్గో పార్శిల్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం. ఖాళీగా ఉన్న మరో స్థలంలో పెట్రోల్ బంకు నడిపేందుకు ప్రతిపాదనలు పంపాం.

గ్రామాలకు బస్సులు నడుపుతున్నారా ?

డీఎం: తెనాలి పరిధిలో కొన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం సరిగాలేక సేవలు అందించలేకపోతున్నాం. గుంటూరు నాన్‌స్టాప్ బస్సులను త్వరలో పునరుద్ధరిస్తాం.

బస్సు ఆపకపోవడం ఫిర్యాదున్నాయా..?

డీఎం: ప్రయాణికులు చెయ్యెత్తినప్పుడు బస్సులు ఆపలేదనే ఫిర్యాదులు వచ్చినప్పుడు సిబ్బందికి ఆ ప్రాంతంలో వారికి సూపర్ వైజ్‌చేసే డ్యూటీవేసి శిక్ష విధిస్తున్నాం. ఇంకా ఎక్కడైనా సమస్యలు ఉంటే 99592 25422కు ఫిర్యాదుచేస్తే తక్షణం చర్యలు తీసుకుంటాం.

ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా శివ

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తెనాలి నియోజకవర్గ ఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గండు శివ, చెన్నూరి సాయిలు ఎన్నికయ్యారు. పట్టణ సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ నిర్మాణ సభను నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్దినేని కిరణ్‌బాబు అధ్యక్షతన ముఖ్య అతిథులుగా పూర్వ ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కనసర్తి బెనహర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిత్యం పోరాటం చేస్తూ ఉండే సంఘం ఏఐఎస్‌ఎఫ్ అని అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా పొన్నెకంటి శోబిత్, ఉపాధ్యక్షుడుగా కుర్ర పవన్, కోశాధికారిగా భూమేష్, కార్యవర్గ సభ్యులుగా దినేష్, జైదీప్, తేజ, మదన్‌మోహన్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో మద్దినేని కిరణ్‌బాబు, చెరుకుమల్లి సింగారావు, సీనియర్ నాయకులు బొల్లిముంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పొన్నూరు సబ్ జైలు

● ఖైదీల తరలింపులో తీవ్ర అవస్థలు ● సబ్ జైలు పునః ప్రారంభమయ్యేనా..?



పొన్నూరు సబ్ జైలు

పొన్నూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు సబ్ జైలు మూతపడి ఐదేళ్లు గడుస్తున్నా నేటికి సబ్‌జైల్ పునరుద్ధరణ కలగానే మారింది. స్వతంత్ర్యానికి పూర్వమే పొన్నూరులో తహసీల్దార్ కార్యాలయం వెనుక సర్వహంగులతో సబ్‌జైల్ నిర్మాణం జరిగింది. పట్టణం నడిమధ్య ఈ సబ్‌జైల్ అందుబాటులో ఉండేది. సబ్ జైలులో సువిశాల ప్రాంగణంలోతోపాటు పురుష ఖైదీలతో పాటు, మహిళా ఖైదీలను ఉంచేందుకు ప్రత్యేక బ్యారెక్‌లు ఉన్నాయి. సబ్ జైలు సౌకర్యవంతంగా ఉన్నప్పటికి సబ్ జైలు ప్రాంగణానికి ప్రధాన రహదారి ఇరుకుగా ఉందనే నెపంతో మరమ్మతులు నిర్వహిస్తామని అప్పటివరకు సబ్ జైలును బాపట్ల జైలుకు మారుస్తున్నట్లు జైళ్లశాఖ ఉత్వర్వులు ఇచ్చింది. పొన్నూరులో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఉన్నాయి. పొన్నూరు కాకుమాను, పెదనందిపాడు మండలాలకు సంబంధించి ఈ కోర్టుల్లో కేసుల విచారణ జరిగేవి, అయితే కాలక్రమంలో నియోజకవర్గాల పునర్విభజన జరగటంతో పొన్నూరు నియోజకవర్గ స్వరూపం మారి చేబ్రోలు, పెదకాకాని మండలాలు కలిశాయి. పొన్నూరు బార్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు పొన్నూరు కోర్టు పరిధిలోకి మరిన్ని మండలాలను తీసుకురావాలని న్యాయశాఖ పరిశీలనలో ఉంది. అయితే సబ్ జైలు మూతపడిన కారణంగా ఈ పరిశీలన పెండింగ్‌లో ఉంచారు. సబ్ జైల్ పునరుద్ధరణ కోసం 2014-2019 మధ్య బార్ అసోసియేషన్ నాయకులు స్థానిక ప్రజాప్రతినిధి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. సబ్‌జైలుకు వెళ్లే ప్రధాన రహదారి ఇరుకుగా ఉండటంతో రహదారి కోసం స్థలం కేటాయించాలని న్యాయవాదులు కోర్టు అధికారులు విజ్ఞప్తి చేశారు. వీరి విజ్ఞాపనలను పరిశీలించిన ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ఆదేశాలతో మున్సిపల్ పాలకులు కోర్టుకు సమీపంగా ఉన్న షాదీ ఖానా సమీపంలోని స్థలాన్ని రహదారి కోసం కేటాయించి తీర్మానం చేసి జైళ్ల శాఖకు పంపారు. తీర్మానం చేసిన స్థలాన్ని జైళ్ల శాఖకు అప్పగించారు. అయితే సబ్ జైల్ పునరుద్ధరణ పీటముడి మాత్రం వీడలేదు. రహదారికి స్థలం కేటాయించినప్పటికి జైలుశాఖ సబ్‌జైల్ పునరుద్ధరణపై దృష్టి సారించకపోవటంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.

తీవ్ర సమస్యగా ఖైదీల తరలింపు

పొన్నూరు సబ్ జైలు మూసివేత పోలీసులకు తీవ్ర తలనెప్పులను తెచ్చిపెడుతుంది. పొన్నూరు కోర్టులో నమోదైన క్రిమినల్ కేసులకు సంబంధించి ఖైదీలను తరలించాలంటే వ్యయ ప్రయాసలకు గురికావాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గతంలో పొన్నూరు సబ్ జైల్ తరలించిన సమయంలో ఈ జైలును బాపట్ల సబ్ జైలుకు అనుసంధానం చేశారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాగా మారటంతో బాపట్ల సబ్ జైలు నుంచి పొన్నూరును వేరు చేసి తెనాలి సబ్ జైలుకు అనుసంధానం చేశారు. పొన్నూరు నుంచి శిక్షపడిన ఖైదీలు కానీ, విచారణ ఎదుర్కొంటున్న ఖైదీలను కోర్టుకు తీసుకువచ్చి తీసుకెళ్లాంటే 30 కిలో మీటర్లకు పైగా దూరం ఉన్న తెనాలికి తీసుకురావటం, తీసుకెళ్లటం సమస్యగా మారింది. తీవ్ర నేరారోపణలు ఉన్న వ్యక్తులు అసాంఘిక శక్తులు కోర్టు విచారణకు వచ్చి వెళ్లే సమయంలో అప్రమత్తంగా లేకుంటే తప్పించుకుని పారిపోయే ప్రమాదం ఉందని సెంట్రీలుగా వెళుతున్న పోలీస్ సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. సబ్ జైలును మరమ్మతులు చేసి రహదారి కోసం వినియోగంలోకి తీసుకురావాలని పోలీస్ సిబ్బందితోపాటు న్యాయవాదులు విజ్ఞప్తి చేస్తున్నారు. విచారణ ఎదుర్కొంటున్న ఖైదీల బంధువులు కూడా ములాఖాత్‌లకు తెనాలి వెళ్లి రావాలంటే ఉన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని స్థానిక సబ్ జైలును పునః ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే పట్టణ ప్రధాన కేంద్రంలో ఉన్న సబ్ జైలు పూర్తిగా శిథిలమైపోయి పనికిరాకుండా పోతుంది.




చిట్టడవిలా ఉన్న సబ్ జైలు ప్రాంగణం, నిరుపయోగంగా మారిన జైలర్ కార్యాలయం

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

● తహసీల్దార్ గోపాలకృష్ణ
● అనుమతులకు ప్రత్యేక డెస్క్
● 26తో ముగియనున్న దరఖాస్తు గడువు

తెనాలి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా విక్రయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. మంగళవారం క్రాకర్స్ అసోసియేషన్ సభ్యులతో తసీల్దార్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ శేషన్, తహసీల్దార్ గోపాలకృష్ణలు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకుని క్రాకర్స్ విక్రయించేందుకు తెనాలిలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆ స్టాల్స్‌లో విక్రయాలు జరిపేందుకు వ్యాపారులు తప్పనిసరిగా సంబంధిత శాఖల అధికారులు అనుమతులు తీసుకోవాలన్నారు. క్రాకర్స్ విక్రయించే స్టాల్స్ వద్ద తప్పనిసరిగా సేఫ్టీ నిబంధనలు పాటించాల్సి ఉందన్నారు. చిన్నపిల్లలను టపాసుల విక్రయాల వద్దకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదన్నారు. స్టాల్స్‌లో విద్యుత్ వంటివి కూడా ఏర్పాటుకు అనుమతించబోమన్నారు. అన్ని దుకాణాలు కనిపించేలా ఒకే పోల్‌కు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. స్టాల్‌కు స్టాల్‌కు మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండేలా చూడాలన్నారు. విక్రయాలు జరిపే వారు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక డెస్క్‌ను సంప్రదించి ఈ నెల 26లోపు దరఖాస్తులను అందజేయాలన్నారు. 27న లాటరీ ద్వారా స్టాల్స్ కేటాయించడం జరుగుతుందన్నారు. అనుమతులు లేకుండా తోపుడు బండ్లపై ఎక్కడా కూడా క్రాకర్స్ అమ్మకాలు జరపరాదన్నారు. తాము చేసే సూచనలు పాటించకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. తొలుత మునిసిపల్ కమిషనర్ శేషన్న, ఫైర్, సివిల్ పోలీసులతో కలిసి స్టాల్స్ ఏర్పాటుకు అనువైన పలు ప్రాంతాలను పరిశీలించారు. బుధవారం స్టాల్స్ ఎక్కడ ఏర్పాటు చేయాలన్న విషయంపై స్పష్టత రానున్నది. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, క్రాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



స్టాల్స్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్, ఇతర శాఖల అధికారులు

కిడ్నాప్ అయిన పాప క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు..

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కిడ్నాప్ అయిన పాపను క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. మంగళవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మారీసేపేటలో నివాసముండే యాచక వృత్తితో జీవించే గోపాల్, లక్ష్మీ దంపతులు ఈ నెల 1వ తేదీన తమ రెండు నెలల పాపతో మారీసుపేట బ్రిడ్జిపై నిద్రించారన్నారు. అర్ధరాతి సమయంలో ఇస్లాంపేటకు చెందిన షేక్ జబ్బార్ అనే జులాయి ఆ పాపను అపహరించుకుపోయాడు. దీంతో ఆ తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. స్పందించిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తుండగా నిందుతుడు జబ్బార్ తన తమ్ముడైన ఆటోడ్రైవర్ ద్వారా పాపను పోలీసులకు అప్పగించి తాను పద్మశాలిపేటలోని సచివాలయంలో వీఆర్‌వో సమక్షంలో లొంగిపోయాడు. వీఆర్‌వో నిందుతుడిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. నిందుతుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రేపల్లె జైలుకు రిమాండ్ విధించారని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం: మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. స్థానిక మారీసుపేట చంద్రబాబు కాలనీలో మంగళవారం పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రజలు మూడు బుట్టల విధానాన్ని పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరూ పట్టణ సుందరీకరణను సకరించాలని కోరారు. కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9వ డివిజన్‌లో ...

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారీసుపేటలోని 9వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో మంగళవారం పారిశుధ్య కార్మికుల మస్టర్ రిజిస్టర్‌ను పట్టణ పురపాలక సంఘ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ శానిటేషన్ పనులను నిర్వహించేటప్పుడు సెల్‌ఫోన్‌లను వాడరాదని, వాటిని వినియోగిస్తూ పారిశుధ్య పనులను నిర్వహించడం వల్ల రోడ్డు ప్రమాదాల బారినపడే ప్రమాదముందని అన్నారు. పారిశుధ్య కార్మికుల హాజరు ప్రతిరోజు వందశాతం ఉండేలా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌కు సూచించారు. అనంతరం పట్టణంలోని 21, 22, 27వ వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.



సుల్తానాను సత్కరిస్తున్న మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్ తదితరులు

పట్టణ స్వయం సహకార సంఘ సభ్యురాలి ప్రతిభ

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సారస్ ఎగ్జిబిషన్‌లో పట్టణ స్వయం సహకార సంఘ సభ్యురాలు సయ్యద్ నహరే సుల్తానా ప్రతిభ చాటారు. మంగళవారం తాడేపల్లిలోని మెప్మా ప్రధాన కార్యాలయంలో పట్టణానికి చెందిన శుభానల్లా స్వయం సహాయక సంఘ సభ్యురాలు సయ్యద్ నహరే సుల్తానాను మెప్మా మిషన్ డైరెక్టర్ ఎస్ తేజ్ భరత్ దుశ్శాలవాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు విజయనగరంలో అఖిల భారత సారాస్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిచారన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి మెప్మా ద్వారా 28 స్టాల్స్‌లో 47 స్వయం సహాయక సంఘ సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులతో అన్ని జిల్లా సభ్యులు పాల్గొన్నారన్నారు. పదిరోజులకు గాను సంఘ సభ్యుల ఉత్పత్తులురూరూ.45.73 లక్షల అమ్మకాలు జరిగి లాభంగా రూ.9.14 లక్షలు వచ్చిందని తెలిపారు. ఈ మొత్తం లాభంలో అత్యధికంగా గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి చెందిన శుభానల్లా స్వయం సహాయక సంఘ సభ్యురాలు సయ్యద్ నహనే నిరగ్ సుల్తానా తయారు చేసిన క్రిస్టల్ బ్యాగ్స్, ఆర్టిఫిషీయల్ జ్యూయలరీ ద్వారా రూ.2.67 లక్షలు అమ్మకాలు చేసి ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న ఎస్‌ఎచ్‌జిల కన్న అధికంగా అమ్మకాలు చేయడం జరిగిందన్నారు. ఆమెను మెప్మా ప్రధాన కార్యాలయానికి పల్పించి అభినందించామని తెలిపారు.

జనావాసాల మధ్య మద్యం షాపు వద్దు

● కలెక్టర్‌కు నంబూరువాసుల ఫిర్యాదు

పెదకాకాని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య మద్యం షాపు వద్దని నంబూరు గ్రామానికి చెందిన ప్రజలు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి మంగళవారం ఫిర్యా దు చేశారు. నంబూరుకు చెందిన సోమ గోపాల్‌రెడ్డి, ఏ వేణురెడ్డి, సెనగల అన్నపూర్ణమ్మతో పాటు మరికొంతమంది కలెక్టర్‌ను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశా రు. దేవాలయంకు, సచివాలయానికి పక్కన, నిత్యం మహిళలు తిరిగే ఈ ప్రాంతంలో బ్రాందీషాపు ఏర్పాటు చేయవద్దని గ్రామస్థులు కోరారు. మద్యం షాప్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో స్కూల్ బస్సులు, కాలేజీ బస్సు లు ఆగుతుంటాయన్నారు. అనంతరం ఎక్సైజ్ శాఖ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు.

రచయిత సుబ్బారావుకు ఘన నివాళి

తెనాలి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత అమ్మిశెట్టి సుబ్బారావు బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు పొందారని అరసం నాయకులు కనపర్తి బెన్‌హర్ చెప్పారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో మంగళవారం ఆయన వర్ధంతి నిర్వహించారు. ఎంవీ రఘునాథరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అమ్మిశెట్టి సాహిత్య ప్రక్రియలను వివరించారు. సమసమాజం స్థాపించేందుకు అభ్యుదయ రచనలు చేశారని చెప్పారు. సినీ రచయితగా ఎన్నో గేయాలు రాశారని, అభ్యుదయ రచయితల సంఘ సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు. రక్తకన్నీరు నాగభూషణం ఆధ్వర్యంలో గాలిమేడలు నాటకాన్ని పలు చోట్ల ప్రదర్శించారని, సాహిత్యరంగంలో ఆయన ఎనలేని సేవ చేశారని పేర్కొన్నారు. బొల్లిముంత కృష్ణ, నాగమణి, శ్రీదేవి, వెంకట్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశాం: ఆలయ ఈవో

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

పెదకాకాని, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శివాలయంలో పూజకు కుళ్ళిపోయిన కొబ్బరికాయలు సరఫరా చేస్తున్న దేవస్థానం కాంట్రాక్టర్ హరీష్‌కు నోటీసులు జారీ చేసినట్లు ఆలయ ఈవో గోగినేని లీలా కుమార్ తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తపై ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ వివరణ ఇచ్చారు. పత్రికలో వచ్చిన వార్త విషయమై దేవస్థానంలోని కొబ్బరిచెక్కలు సేకరించే లైసెన్సు హక్కుదారులైన బత్తుల భాస్కరరావు ఫిర్యాదుపై కొబ్బరికాయల షాపు లైసెన్సుదారునికి, సదరు దేవస్థానానికి కొబ్బరికాయలు సరఫరా చేసే లైసెన్సుదారులకు నోటీసులు జారీచేసినట్లు తెలిపారు. వారిద్దరి నుంచి వచ్చే లిఖిత పూర్వక సమాధానంను పరిశీలించి తగు శాఖపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: తహసీల్దార్

చేబ్రోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ ఆదేశించారు. మండల పరిధిలోని శలపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం తహశీల్దార్ సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో జరిగిన గ్రామ సభలో రెవెన్యూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కూటమి పార్టీల నాయకులు, రెవెన్యూ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకలను నివారించుకోవాలి: ఏవో

కొల్లిపర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు సామూహికంగా ఎలుకలను నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకట్రావు అన్నారు. మంగళవారం మండలంలోని గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రోమోడయోలిన్ ఎలుకల మందును నూకలు, నూనెలో కలిపే విధానాన్ని వ్యవసాయాధికారులు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సామూహిక చర్యలతోనే ఎలుకలను నివారించవచ్చని లాం శాస్త్రవేత్త ఎస్ వెంకటలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని గోళ్లమూడిపాడులో మంగళవారం సామూహిక ఎలుకల నివారణ మందుల తయారీ, పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రత్నమంజుల, ఎడిఏవి రామకోటేశ్వరి, ఏవో దేగల వెంకట రామయ్య, ఏఎంసి మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బి.బాబురావు, జి.రామకృష్ణ పాల్గొన్నారు.

● తెనాలి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కంచర్లపాలెం, సోమసుందపాలెం తదితర గ్రామాల్లో ఏవో ప్రేమసాగర్ పర్యటించారు. రైతులకు వరిసాగులో వచ్చే కాండం తొలచే పురుగును గుర్తించడం, వాటి నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు దొప్పలపూడి విద్యార్థులు



రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైన దొప్పలపూడి విద్యార్థులతో ఉపాధ్యాయులు

పొన్నూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు దొప్పలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పల్లెకోన శ్యామ్ సునీత లత తెలిపారు. మంగళవారం విద్యార్థుల అభినందన కార్యక్రమం పాఠశాలలో జరిగింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి పోటీల్లో దొప్పలపూడి హైస్కూల్‌కు చెందిన పులిపాటి సాయి భార్గవ్, గోళ్లమూడి ఆదిత్య, చల్లంచర్ల షారోన్ కుమారి, దేవరపల్లి విజయలక్ష్మి అత్యంత ప్రతిభచూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబరు 8, 9, 10 తేదీలో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలలో ఈ విద్యార్థులు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తస్నీరు శివరామయ్య, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన నారాకోడూరు విద్యార్థులు

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నారాకోడూరు..

చేబ్రోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-14 హ్యాండ్ బాల్ పోటీలకు నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ నెల 26నుంచి 28 వరకు తెనాలిలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌కు వి.హారీష్, వై అనీల్, షేక్ బషీర్, ఎన్ చార్లఎస్ వెస్లీ, ఎస్.జాన్‌వెస్లీ, టి.క్రాంతి ఎంపికైనట్లు చెప్పారు. ఈ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, బి.వెంకటేశ్వరరావు, ఎన్.ఉమామహేశ్వరి, శరత్ కుమార్ తదితరులు అభినందించారు.



అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న పీబీఎన్ కళాశాల నిర్వాహకులు

నైపుణ్యాభివృద్ధికి అవగాహన ఒప్పందం

● పీబీఎన్ కళాశాల అధ్యక్షుడు కెప్టెన్ అంకప్పచౌదరి

పొన్నూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవటమే కాకుండా పరిశ్రమలో ఉపాధి అవకాశాలు పొందేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు పీబీఎన్ కళాశాల అధ్యక్షుడు కెప్టెన్ ఎస్.అంకప్పచౌదరి తెలిపారు. మంగళవారం ఒప్పందంపై సంతకాలు చేసినట్లు వివరించారు. బీఎస్సీ ఎలక్ట్రానిక్స్‌లో అప్రెంటీస్‌షిప్, ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రాంను పీబీఎన్ కళాశాలలో ఈ ఒప్పందం ద్వారా ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఎల్‌క్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహనరావు సమక్షంలో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. సకాలంలో రెగ్యులర్ డిగ్రీతోపాటు ఎలక్ట్రానిక్స్ రంగంపై నైపుణ్యం పెంచుకోవటం, ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవటం ఎలక్ట్రానిక్స్ రంగంను బలోపేతం చేసేలా విద్యార్థులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించటం ఈ అవగాహన ఒప్పందంలోని ప్రధాన అంశాలుగా తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌క్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్‌ప్రెసిడెంట్ సలీమ్ అహ్మద్, సరోజ్‌కుమార్, లావాది రావత్, కళాశాల కరస్పాండెంట్ ఎస్.అన్నారావు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివకుమారి, డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ కె.శ్రీకాంత్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

కొసరాజు వెంకట్రాయుడు మృతి



పొన్నూరు టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతు సంఘం నాయకులు, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ మాజీ డైరెక్టర్ కొసరాజు వెంకట్రాయుడు (85) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. కొసరాజు వెంకట్రాయుడు ఆచార్య ఎన్జీరంగా ప్రియ శిష్యుడిగా గుర్తింపు పొందారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో రాష్ట్రస్థాయి పదవులతో పాటు రైతు సమస్యలపై నిరంతరం పోరాడుతూ రైతు సంఘంలో క్రియాశీలకంగా పనిచేశారు. ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా పనిచేశారు. వెంకట్రాయుడు సతీమణి రాజ్యలక్ష్మి పొన్నూరు మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా పనిచేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కొసరాజు వెంకట్రాయుడు మృతికి పొన్నూరు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. వెంకట్రాయుడుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకట్రాయుడు మృతికి ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సంతాపం తెలిపారు.



విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న న్యాయాధికారి

ప్రభుత్వ హాస్టల్స్‌లో పరిస్థితులు మెరుగుపరచాలి

● న్యాయాధికారి పవన్‌కుమార్

తెనాలి క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్స్‌లో పరిస్థితులు మెరుగుపరచాలని ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ డి.శ్రీనివాసులు ఆదేశాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా పరిశీలించారు. హాస్టల్స్‌లో అందుతున్న వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాల, బాత్రూమ్, టాయిలెట్స్ పరిశీలించి అవి అపరిశుభ్రంగా ఉండటం గుర్తించిన న్యాయాధికారి వార్డెన్స్‌కు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది షేక్ మహబూబ్, పోలీసులు పాల్గొన్నారు.



కోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న రామకృష్ణ తదితరులు

పాల ఉత్పత్తిదారు కుటుంబానికి రూ.60 వేలు సాయం

తెనాలి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో మృతి చెందిన పాల ఉత్పత్తిదారు అమ్మిశెట్టి కుటుంబరావు కుటుంబానికి రూ.60 వేలు సాయం చేశారు. సంగం డెయిరీ - డీవీసీ అభయ పథకం కింద మంగళవారం పాల సొసైటీలో జరిగిన కార్యక్రమంలో చెక్కు అందజేశారు. సంగం డెయిరీ ఎంసీసీ ఇన్‌చార్జి ధూళిపాళ్ల రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ గరికపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.